




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 353 పేజీలు : 8+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి గురువారం 7 ఆగస్టు 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## భారత్ పై మరో 25 శాతం సుంకం విధించిన ట్రంప్

- భారత దిగుమతులపై 25% అదనపు సుంకం విధిస్తూ ట్రంప్ ఉత్తర్వు
- రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడమే కారణమని స్పష్టం చేసిన అమెరికా
- రష్యాపై ఆంక్షలను బలపరిచేందుకే ఈ చర్యలని తెలిపిన వైట్ హౌస్
- 21 రోజుల తర్వాత అమల్లోకి రానున్న కొత్త టారిఫ్‌లు
- ఇప్పటికే రవాణాలో ఉన్న సరుకులకు సెప్టెంబర్ 17 వరకు మినహాయింపు
- ఇతర దేశాలపైనా నిఘా పెట్టాలని అధికారులకు ట్రంప్ ఆదేశం




వివరాలు 2లో..

## రూ.260 కోట్ల మెగా సైబర్ స్కామ్.. ఈడీ దర్యాప్తులో బయటపడ్డ క్రిప్టో హవాలా దందా!



హైదరాబాద్ పెన్ పవర్:ప్రపంచ వ్యాప్తంగా క్రిప్టో కరెన్సీలను అక్రమార్కులు తమ కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుం టున్నారనే ఆందో ళనలు చాలా కాలం నుంచి వినిపి స్తూనే ఉన్నాయి. అయితే తాజాగా మెగా గ్లోబల్ సైబర్ ఫ్రాడ్ కేసును చేధించే పనిలో ఈడీ నిమగ్నమైంది. ఇందులో

వివరాలు 2లో..

## అది బీసీ సభ కాదు... గాంధీ కుటుంబ భజన సభ



- ఢిల్లీలో కాంగ్రెస్ బీసీ సభ గాంధీ కుటుంబ ప్రశంసలకే పరిమితం
- రాజకీయ ఒత్తిడితోనే ఢిల్లీలో రేవంత్ రెడ్డి సభ ఏర్పాటు
- హామీ నిలబెట్టుకోకుండా బీజేపీపై కాంగ్రెస్ నిందలు వేస్తోంది
- ముస్లింలతో కూడిన బీసీ రిజర్వేషన్లను తీవ్రంగా వ్యతిరేకిస్తాం
- స్థానిక ఎన్నికల ఓటమి భయంతోనే కాంగ్రెస్ డ్రామాలు

హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ సభపై కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అది బీసీల ప్రయోజనాల కోసం పెట్టిన సభలా కాకుండా, గాంధీ కుటుంబాన్ని పొగడటానికే పరిమితమైందని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణలో అంతర్గత రాజకీయ ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు, అధిష్ఠానం అనుగ్రహం పొందడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సభను ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై

వివరాలు 2లో..



## సబితా ఇంద్రారెడ్డికి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలి

- సబిత పట్ల కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరు దారుణం అంటూ హరీశ్ ఆగ్రహం
- మహిళా శాసనసభ్యురాలి పట్ల దౌర్జన్యం సిగ్గుచేటని వ్యాఖ్య
- ప్రజాక్షేత్రంలో మీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామన్న హరీశ్

హైదరాబాద్ పెన్ పవర్:మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి పట్ల కాంగ్రెస్ నేతలు వ్యవహరిం చిన తీరు పట్ల మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పు కుంటూ ఒక మహిళా శాసనసభ్యురాలి పట్ల ఇంత దారుణంగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. సాక్షాత్తు ఒక

వివరాలు 2లో..

# బీసీ బిల్లు ఆమోదించపోతే మోదీని గద్దె దించుతం

- నాలుగు నెలలుగా పెండింగ్లో పెట్టారు
- రాష్ట్రపతి వద్దే రెండు బిల్లులు

- రాష్ట్ర ప్రభుత్వం అంతా వచ్చినా రాష్ట్రపతి అపాయింట్ మెంట్ ఇవ్వలే
- గుజరాత్, యూపీల్లో ముస్లింలకు రిజర్వేషన్ ఎందుకిస్తున్నరు..
- తెలంగాణలో ఇవ్వొద్దా.. బీజేపీ నేతలవి గాలి మాటలు
- ముస్లింలను బూచిగా చూపి.. బీసీలకు అన్యాయం చేసే కుట్ర
- ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:రాహుల్ గాంధీ ఆశయం మేరకు తమ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ బిల్లు తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లును అసెంబ్లీలో పాస్ చేశామని చెప్పారు. దేశానికి ఆదర్శంగా నిలిచేలా తెలంగాణలో కులగణన జరిగిందని అన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన జరగాలని భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న బీసీ ధర్నాలో ప్రసంగిస్తూ రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అసెంబ్లీ పంపిన బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉన్నాయని రేవంత్ అన్నారు. రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు ఆమె అపాయింట్‌మెంట్ కోరామని... అయితే, రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దొరకలేదని చెప్పారు. తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వొద్దని రాష్ట్రపతిపై ప్రధాని మోదీ ఒత్తిడి తెచ్చారనేది తమ అనుమానమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. రిజర్వేషన్ బిల్లుకు మోదీ మద్దతు ఇవ్వకపోతే... మోదీని గద్దె దించి, రాహుల్ ను ప్రధాని చేసుకుని... బీసీ రిజర్వేషన్లను సాధించుకుంటామని అన్నారు.



## కేసీఆర్ చెప్పినట్టుగానే జాగృతి ముందుకెళ్లింది

- బీసీల కోసం జాగృతి తరపున అనేక పోరాటాలు నిర్వహించబోతున్నామన్న కవిత
- బీసీలను కాంగ్రెస్, బీజేపీ మోసం చేస్తున్నాయని మండిపాటు
- అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్

వివరాలు 2లో..

హైదరాబాద్ పెన్ పవర్:బీసీల కోసం జాగృతి తర పున అనేక పోరాటాలు నిర్వహించబోతు న్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. తెలంగాణ అ స్తిత్వం, వన రులు, సాం స్కృతిక వైరుధ్య పరిరక్షణ కోసం ఏర్పాటైనదే



## రష్యా తరపున చైనా, పాక్ కిరాయి సైనికులు పోరాడుతున్నారు

- పాకిస్థాన్, చైనాలపై జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు
- వోవ్‌చాన్స్క్ ప్రాంతంలో పర్యటించినప్పుడు ఈ విషయం తెలిసిందన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు
- తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, ఆఫ్రికా దేశాల వారూ ఉన్నారని వెల్లడి
- కిరాయి సైనికులకు తగిన విధంగా బదులిస్తామని జెలెన్‌స్కీ హెచ్చరిక



హైదరాబాద్ పెన్ పవర్: ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున చైనా, పాకిస్థాన్‌తో పాటు మరికొన్ని దేశాలకు చెందిన కిరాయి సైనికులు పోరాడుతున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు చేశారు. రష్యా పక్షాన పోరాడుతున్న ఈ విదేశీ కిరాయి మూకలకు తగిన విధంగా బదులిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. జెలెన్‌స్కీ కీలకమైన వోవ్‌చాన్స్క్ యుద్ధ క్షేత్రంలో పర్యటించి, అక్కడి సైనికులతో సమావేశమయ్యారు.

వివరాలు 2లో..

## అమిత్ షా పరువునష్టం కేసు.. రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరు

- అమిత్ షాపై పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి ఊరట
- ఝార్ఖండ్‌లోని చాయ్‌బాసా కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నేత
- కోర్టుకు హాజరవడంతో వెంటనే బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం
- 2018లో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన కేసు
- రాహుల్ రాక సందర్భంగా చాయ్‌బాసాలో కట్టుదిట్టమైన భద్రత



వివరాలు 2లో..

## ఢిల్లీలో కొత్త పరిపాలనా సౌధం.. 'కర్తవ్య భవన్'ను ప్రారంభించిన ప్రధాని మోదీ

- ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో 'కర్తవ్య భవన్-03'ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఏటా అద్దెల రూపంలో చెల్లిస్తున్న రూ. 1,500 కోట్లు ఆదా అవుతుందని వెల్లడి
- ఒకేచోటకు ఏడు కీలక మంత్రిత్వ శాఖల తరలింపుతో సమన్వయం సులభతరం
- అత్యాధునిక భద్రత, పర్యావరణ హిత ఫీచర్లతో భవనం నిర్మాణం

హైదరాబాద్ పెన్ పవర్: దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చెల్లాచెదురుగా ఉన్న మంత్రిత్వ శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు



వివరాలు 2లో..

## ప్రభుత్వ పథకాలపై సీఎం బొమ్మలు, పార్టీ గుర్తులు ఉండొచ్చు...

**మద్రాస్ హైకోర్టు తీర్పును కొట్టివేసిన సుప్రీంకోర్టు**

- ప్రభుత్వ పథకాలకు నేతల పేర్లు, ఫోటోల వాడకంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- మద్రాస్ హైకోర్టు ఇచ్చిన వ్యతిరేక ఉత్తర్వులను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం
- ఇది దేశవ్యాప్తంగా ఉన్న విధానమేనని స్పష్టం చేసిన కోర్టు
- రాజకీయ పోరాటాలు ప్రజల్లోనే జరగాలి, కోర్టుల్లో కాదని హితవు
- పిటిషన్ వేసిన ఏఐఏడీఎంకే ఎంపీకి రూ.10 లక్షల జరిమానా
- డీఎంకే ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు.. భారీ ఊరట



హైదరాబాద్ పెన్ పవర్:రాజకీయ యుద్ధాలు కోర్టుల్లో కాదు, ప్రజల మధ్యే జరగాలని సుప్రీంకోర్టు సం చలన వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ సంక్షేమ

వివరాలు 2లో..

## నేను ప్రచారం చేసింది బెట్టింగ్ యాప్ కు కాదు!



హైదరాబాద్ పెన్ పవర్:అక్రమ బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించిన కేసులో ప్రముఖ టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో అధికారులు ఆయన్ను సుమారు నాలుగున్నర గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన విజయ్ దేవరకొండ మీడియాతో మాట్లాడుతూ, తాను ప్రచారం చేసింది గేమింగ్ యాప్ కోసమేనని, బెట్టింగ్ యాప్ కోసం కాదని స్పష్టం చేశారు. ఈడీ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను సమాధానాలు ఇచ్చానని విజయ్ తెలిపారు. "గేమింగ్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌ల మధ్య చాలా తేడా ఉంది. ప్రభుత్వం గుర్తించి, లైసెన్స్ ఇచ్చిన చట్టబద్ధమైన గేమింగ్ యాప్‌ను మాత్రమే నేను ప్రమోట్ చేశాను. ఈ విషయంపై అధికారులు అడిగిన అన్ని వివరాలు, కంపెనీ, ఆర్థిక లావాదేవీల సమాచారం అందించాను.

వివరాలు 2లో..

- అక్రమ బెట్టింగ్ యాప్స్ కేసులో ఈడీ విచారణకు హాజరైన విజయ్ దేవరకొండ
- దాదాపు నాలుగున్నర గంటల పాటు ప్రశ్నించిన అధికారులు
- తాను ప్రభుత్వ అనుమతి ఉన్నవాటినే ప్రచారం చేశానని వెల్లడి
- ఇదే కేసులో ఇప్పటికే నటుడు ప్రకాశ్ రాజ్ విచారణ పూర్తి
- త్వరలో రానా, మంచు లక్ష్మి కూడా విచారణకు హాజరుకానున్న వైనం

## ఎడిటర్ వ్యూ

## యాపిల్ తింటున్నారా.. అందులో కోట్ల బ్యాక్టీరియా ఉంటుంది..!

రోజుకొక యాపిల్ తింటే ఆరోగ్యానికి మంచిది. డాక్టర్ దగ్గరికి వెళ్లాల్సిన అవసరం ఉండదని పరిశోధకులు చెప్తుంటారు. అందుకు కారణం ఫైబర్, విటమిన్స్ యాపిల్‌లో పుష్కలంగా లభించడం. కానీ, అదే పరిశోధకులు యాపిల్ గురించి షాకింగ్ విషయమొకటి వెల్లడించారు. ఒక యాపిల్ పండులో 100 మిలియన్ల(పది కోట్ల)కు పైగా బ్యాక్టీరియాలు ఉంటాయని నిర్ధారించారు. అయితే ఇవి శరీరానికి మంచి చేస్తాయా? చెడు చేస్తాయా? అనేది అవి పండించే పద్ధతిపై ఆధారపడి ఉంటుందని చెప్తున్నారు.
సాధారణంగా యాపిల్స్‌లో ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియాలు కూడా ఉంటాయి. అయితే ఆ మధ్య కొన్ని యాపిల్ రకాలపై జరిగిన పరిశోధనల్లో డేంజరస్ ఫంగీ జాతుల్ని గుర్తించారు. దీంతో ఆస్ట్రియాకు చెందిన గార్జ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు యాపిల్‌పై పరిశోధనల్ని ముమ్మరం చేశారు. ఈ రీసెర్చిలో తేలింది ఏంటంటే.. పావు కేజీ బరువు ఉన్న ఒక యాపిల్‌లో సుమారు 10 కోట్ల బ్యాక్టీరియాలు బయటపడ్డాయి. తొక్క, విత్తనాలు, గుజ్జు.. ఇలా ప్రతీదాంట్లోనూ బ్యాక్టీరియాల జాడ ఉంది. అయితే ఆర్గానిక్ పద్ధతుల్లో పండించిన పండ్లకు, సాధారణ పద్ధతుల్లో పండించిన పండ్లకు బ్యాక్టీరియా కౌంట్ విషయంలో పెద్ద తేడాలేవి లేవట. కానీ, సేంద్రీయ పద్ధతుల్లో పండించిన పండ్లలో హానికలిగించే బ్యాక్టీరియా తక్కువగా ఉండటం ఊరట ఇచ్చే విషయమని చెప్తున్నారు.

**ఫ్రెండ్లీ బ్యాక్టీరియాలు!**

సాధారణ యాపిల్ పండ్లలో ఫ్రాంటియర్స్ అనే జర్నల్ కథనం ప్రకారం'ఎశ్చరేషియా%–% షిజెల్లా' అనే హానికర బ్యాక్టీరియా ఉంటుంది. కానీ, సేంద్రియ పద్ధతుల్లో పండించిన పండ్లలో వాటి జాడే కనిపించలేదని రీసెర్చర్లు తెలిపారు. సేంద్రియ యాపిల్స్‌లో 'మిథైలోబ్యాక్టీరియమ్', 'లాక్టోబాసిల్లై' లాంటి ఫ్రెండ్లీ బ్యాక్టీరియాలు అధికంగా కనిపించాయని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన ప్రొఫెసర్ గార్బియెల్ బర్గ్ చెబుతోంది. అయితే యాపిల్స్‌లో మాత్రమే కాదని, దాదాపు అన్ని పండ్లు, కూరగాయల్లో బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ జాతులు ఉంటాయని ఆమె అంటోంది. ఉడకబెట్టినప్పుడు, వండినప్పుడు అవి నశిస్తాయని, వాటితోపాటు ఒక్కోసారి మేలు చేసేవి కూడా అంతమవుతుంటాయని అందామె.

## 'స్త్రీ శక్తి' పథకానికి ఆమోదం..

- మొదటి పేజీ తరువాయి

'ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ టెక్ హబ్స్' (లిఫ్ట్) పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పాలసీ కింద ఫార్చ్యూన్ 500, ఫోర్బ్స్ గ్లోబల్ 2000 వంటి జాబితాలలో స్థానం పొందిన బడా కంపెనీలకు పరిశ్రమల స్థాపన కోసం తక్కువ ధరకు భూములను కేటాయిస్తారు. విశాఖ, అమరావతి, తిరుపతి వంటి నగరాల్లో ఐటీకి అనువైన వాతావరణం కల్పించనున్నారు. అయితే, భూమి పొందిన కంపెనీలు కఠిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఐటీ కంపెనీ అయితే కనీసం 3,000 ఉద్యోగాలు, జీసీసీ అయితే 2,000 ఉద్యోగాలు కల్పించాలి. ప్రతి ఎకరాకు కనీసం 500 మందికి ఉపాధి అవకాశాలు ఇవ్వాలనే షరతు విధించారు.

**కొత్త బార్ పాలసీ.. లాటరీతో కేటాయింపులు**

ఆగస్టు 31తో ముగియనున్న ప్రస్తుత బార్ పాలసీ స్థానంలో 2025–28 సంవత్సరాలకు నూతన బార్ పాలసీని కేబినెట్ ఆమోదించింది. కార్టెల్ వ్యవస్థను నిరోధించేందుకు, పారదర్శకత పెంచేందుకు ఈసారి బార్లను లాటరీ పద్ధతిలో కేటాయించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు లైసెన్సులు జారీ చేయనున్నారు. గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి లైసెన్స్ ఫీజులో 50% రాయితీతో 10% రిజర్వేషన్ కల్పించారు. జనాభా ఆధారంగా మూడు కేటగిరీలుగా లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. వ్యాపార సమయాన్ని ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పొడిగించారు.

**మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లు**

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నివారించి, శాంతిభద్రతల సమస్యలను అరికట్టే లక్ష్యంతో ప్రభుత్వం మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇచ్చింది. రూ.5 లక్షల లైసెన్స్ ఫీజుతో, 1000 చదరపు అడుగులకు మించకుండా ఈ పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, ఈ రూమ్‌లలో వంటగదికి అనుమతి లేదని స్పష్టం చేశారు.

## అమిత్ షా పరువునష్టం కేసు.. రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరు

- మొదటి పేజీ తరువాయి

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో దాఖలైన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి బుధవారం ఝార?ండ్‌లోని చాయ్‌బాసా ఎంపీ–ఎమ్మెల్యే కోర్టుకు ఆయన హాజరయ్యారు. రాహుల్ గాంధీ హాజరు అనంతరం న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2018లో చాయ్‌బాసాలో జరిగిన ఓ బహిరంగ సభలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రతిష్ఠకు భంగం కలిగించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి ఈ కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రత్యేక న్యాయస్థానం, రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా హాజరు కావాలని గతంలో ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి జూన్ 26న హాజరు కావాల్సి ఉండగా, ఇతర కార్యక్రమాల కారణంగా తేదీని మార్చాలని రాహుల్ తరఫు న్యాయవాది ఝార?ండ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దాంతో ఆగస్టు 6న హాజరుకావాలని హైకోర్టు స్పష్టం చేసింది.కోర్టు ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ ఈరోజు విచారణకు హాజరయ్యారు. కాగా, ఝార?ండ్ మాజీ సీఎం శిబు సోరెన్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ ఇప్పటికే రాష్ట్రానికి వచ్చారు. అంత్యక్రియల అనంతరం ఆయన రాంచీ నుంచి హెలికాప్టర్‌లో చాయ్‌బాసాకు చేరుకున్నారు. రాహుల్ రాక నేపథ్యంలో అధికారులు టాటా కాలేజ్ గ్రౌండ్‌లో ప్రత్యేక హెలిప్యాడ్ ఏర్పాటు చేసి, కోర్టు పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగనుంది.

## రష్యా తరఫున చైనా, పాక్ కిరాయి సైనికులు పోరాడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

ఈ పర్యటన అనంతరం జెలెన్స్కీ సోషల్ మీడియా వేదికగా ఈ వివరాలు వెల్లడించారు. "వోవ్‌చాన్స్క ప్రాంతంలో దేశాన్ని రక్షిస్తున్న మన సైనికులను కలిశాను. యుద్ధ క్షేత్రంలోని పరిస్థితులు, రక్షణ వ్యూహాలపై కమాండర్లతో చర్చించాను. ఈ సందర్భంగా, రష్యా పక్షాన చైనా, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తో పాటు కొన్ని ఆఫ్రికా దేశాలకు చెందిన కిరాయి సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నట్లు మా సైనికులు నివేదించారు. దీనిపై మేము తప్పకుండా స్పందిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు జెలెన్స్కీ కృతజ్ఞతలు తెలిపి, వారికి ప్రభుత్వ అవార్డులను ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా, ఉక్రెయిన్ యుద్ధభూమిలో పోరు తీవ్రంగా కొనసాగుతోంది. ఆగస్టు 5న ఒక్కరోజే రష్యా, ఉక్రెయిన్ దళాల మధ్య 143 సార్లు భీకర ఘర్షణలు జరిగినట్లు ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ తెలిపారు. ముఖ్యంగా పోక్రోవ్స్క సెక్టార్‌లో అత్యంత తీవ్రమైన దాడులు జరిగినట్లు ఆగస్టు 6న ఉదయం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గత 24 గంటల్లో రష్యా దళాలు రెండు క్షిపణి దాడులు, 107 వైమానిక దాడులు చేశాయని, ఉక్రెయిన్ సైనిక స్థావరాలు, జనావాసాలపై 147 గైడెడ్ బాంబులను ప్రయోగించాయని ఆ నివేదిక వివరించింది. రష్యా దాడులకు ప్రతిగా, తమ వైమానిక, క్షిపణి దళాలు రష్యాకు చెందిన 14 లక్ష్యాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ సైన్యం తెలిపింది. వీటిలో శత్రువుల కమాండ్ పోస్టులు, సైనిక స్థావరాలు, ఆయుధాగారాలు ఉన్నట్లు స్పష్టం చేసింది.

# అది బీసీ సభ కాదు... గాంధీ కుటుంబ భజన సభ

- మొదటి పేజీ తరువాయి

కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 31 నిమిషాల ప్రసంగంలో దాదాపు సగం సమయం కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ప్రశంసించడానికే కేటాయించారు. దీన్ని బట్టే ఈ సభ అసలు ఉద్దేశం ఏమిటో అర్థమవుతోంది" అని అన్నారు. బీసీల సాధికారతపై కాంగ్రెస్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని బీసీ సమాజం గ్రహించిందని, అందుకే ఇలాంటి నాటకాలకు తెరలేపారని విమర్శించారు. తెలంగాణలో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ హామీని నిలబెట్టుకోకుండా, చట్టపరమైన చర్యలు తీసుకోకుండా బీజేపీపై నిందలు వేసి తప్పించుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మత ప్రాతిపదికన, ముఖ్యంగా ముస్లింలను కలుపుకొని ఇచ్చే బీసీ రిజర్వేషన్లను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోదని ఆయన తేల్చిచెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే భయంతోనే, రిజర్వేషన్ల అంశాన్ని సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రంలో అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పగటి కలలు కంటోందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో సుస్థిర పాలన కొనసాగుతోందని అన్నారు. రాబోయే 30 ఏళ్ల వరకు కాంగ్రెస్ పార్టీ అధికారం గురించి ఆలోచించడం మానేయాలని ఆయన సూచించారు.

# కేసీఆర్ చెప్పినట్టుగానే జాగృతి ముందుకెళ్లింది

- మొదటి పేజీ తరువాయి

జాగృ తి అని చెప్పారు. తెలం గాణ సమయంలో కేసీఆర్ చెప్పినట్టుగా జాగృతి ముందుకె ళ్లిందని తెలిపారు. జయశంకర్ సార్ ఆలోచనలను తు.చ. తప్పకుండా పాటించామని చెప్పారు. జూబ్లీహిల్స్ లోని కార్యాలయంలో ఈరోజు జాగృతి ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.
బీసీలను కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ధర్నాపై విమర్శలు గుప్పించారు. ఈ ధర్నా వల్ల ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. రాష్ట్రపతి అపాయింట్ మెంట్ తీసుకుని అఖిలపక్షాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్లాలని
డిమాండ్ చేశారు. ఈ విషయంపై అన్ని పార్టీల నేతలకు ప్రభుత్వం లేఖలు రాయాలని చెప్పారు. ఈ నెల 15లోపు జాగృతి నూతన కమిటీల ఏర్పాటు ఉంటుందని కవిత తెలిపారు. జాగృతిలోకి వచ్చేందుకు ఎంతో మంది రెడీగా ఉన్నారని... తమకు అన్ని వర్గాల మద్దతు ఉందని చెప్పారు.

# నేను ప్రచారం చేసింది బెట్టింగ్ యాప్ కు కాదు!

- మొదటి పేజీ తరువాయి

నా వివరణతో వారు సంతృప్తి చెందారు" అని ఆయన అన్నారు.తాను ప్రచారం చేసిన %ూ%23 యాప్ కొన్నిచోట్ల ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించగా, "చట్టబద్ధమైన యాప్‌లకు జియో–లొకేషన్ లాక్ ఉంటుంది. తెలంగాణలో దాన్ని తెరవాలని ప్రయత్నిస్తే, ఈ ప్రాంతంలో అనుమతి లేదని సందేశం వస్తుంది. ఏ రాష్ట్రాల్లో అనుమతి ఉందో అక్కడే ఆ యాప్ పనిచేస్తుంది" అని విజయ్ వివరించారు. ఏది తప్పు, ఏది ఒప్పు అనేది ప్రభుత్వాలు, కోర్టులు నిర్ణయిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ కేసులో ఈడీ విచారణ ఎదుర్కొన్న రెండో నటుడు విజయ్ దేవరకొండ. గత నెల 30న నటుడు ప్రకాశ్ రాజ్‌ను అధికారులు ఐదు గంటల పాటు విచారించారు. అయితే, తాను ఒక గేమింగ్ యాప్ కోసం ప్రకటన చేసినప్పటికీ, మనస్సాక్షి అంగీకరించకపోవడంతో ఎలాంటి పారితోషికం తీసుకోలేదని ప్రకాశ్ రాజ్ అధికారులకు తెలిపినట్లు సమాచారం.ఈ కేసులో భాగంగా ఈడీ మొత్తం 29 మంది సినీ ప్రముఖులు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసు నమోదు చేసింది. వీరిలో రానా దగ్గుబాటి, మంచు లక్ష్మికి కూడా నోటీసులు జారీ చేసింది. రానా ఆగస్టు 11న, మంచు లక్ష్మి ఆగస్టు 13న విచారణకు హాజరుకావాల్సి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నమోదైన పలు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది.

## ఢిల్లీలో కొత్త పరిపాలనా సౌధం.. 'కర్తవ్య భవన్'ను ప్రారంభించిన ప్రధాని మోదీ

- మొదటి పేజీ తరువాయి

తెస్తూ, సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన 'కర్తవ్య భవన్–03'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కొత్త సమీకృత పరిపాలనా సముదాయం వల్ల ప్రభుత్వానికి ఏటా అద్దెల రూపంలో ఖర్చయ్యే రూ. 1,500 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని స్పష్టం చేశారు.

**అద్దె భవనాలకు స్వస్తి.. పెరగనున్న సామర్థ్యం**

ప్రస్తుతం ఢిల్లీలో పలు కీలక మంత్రిత్వ శాఖలు దశాబ్దాల క్రితం నిర్మించిన శాస్త్రి భవన్, కృషి భవన్, ఉద్యోగ్ భవన్ వంటి పాత భవనాల్లో, మరికొన్ని అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయని ప్రధాని గుర్తుచేశారు. "వివిధ కార్యాలయాలు చెల్లాచెదురుగా ఉండటంతో దాదాపు 8,000 నుంచి 10,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు పనుల నిమిత్తం రోజూ ప్రయాణించాల్సి వస్తోంది. ఇది ట్రాఫిక్ రద్దీకి, ఇంధన ఖర్చులకు కారణమవడమే కాకుండా, పని సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తోంది. కర్తవ్య భవన్ నిర్మాణంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది" అని ప్రధాని వివరించారు. ఈ కొత్త భవనం ప్రజానుకూలం, పర్యావరణ అనుకూలం అని ఆయన అభివర్ణించారు.

**ఒకేచోట ఏడు కీలక మంత్రిత్వ శాఖలు**

కర్తవ్య పథ్‌లో నిర్మించిన ఈ భవనంతో పాలనలో వేగం, మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు 1.5 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో, రెండు బేస్‌మెంట్లు, ఏడు అంతస్తులతో (గ్రౌండ్ ం 6) ఈ భవనాన్ని నిర్మించారు. ఇందులో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి, ఎంఎస్ఎంఈ, సిబ్బంది–శిక్షణ (%ణశీు%), పెట్రోలియం–సహజ వాయువు, ప్రధాన శాస్త్రీయ సలహాదారు (%ూూూ%) కార్యాలయాలు కొలువుదీరనున్నాయి.

**అత్యాధునిక, పర్యావరణ హిత నిర్మాణం**

కర్తవ్య భవన్ నిర్మాణంలో అత్యాధునిక టెక్నాలజీతో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు.
సాధారణ భవనాలతో పోలిస్తే 30 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగించేలా డిజైన్ చేశారు.
భవనం లోపల ఉష్ణోగ్రతను నియంత్రించి, బయటి శబ్దాలను తగ్గించేందుకు డబుల్ గ్లేజ్డ్ ఫ్యాసేడ్ విండోలను అమర్చారు.
ఆక్యుపెన్సీ సెన్సర్లతో కూడిన ఎల్ఈడీ లైటింగ్, విద్యుత్ ఆదా చేసే స్మార్ట్ లిఫ్టులు ఏర్పాటు చేశారు.
భవనం పైకప్పుపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఏటా 5.34 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.
జీరో డిశ్చార్జ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అనుసరిస్తున్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేసి తిరిగి వినియోగిస్తారు. నిర్మాణంలో కూడా రీసైకిల్ చేసిన వ్యర్థాలను వాడారు.
ఐడీ కార్డు ఆధారిత ప్రవేశాలు, ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్ నిఘా, సెంట్రలైజ్డ్ కమాండ్ సిస్టమ్‌తో భద్రతను కట్టుదిట్టం చేశారు.

**ఇవి పాలనా దేవాలయాలు: ప్రధాని మోదీ**

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఆగస్టు నెల విప్లవాల మాసమని అన్నారు. "గత కొన్నేళ్లుగా రాజధానిలో నిర్మించిన నూతన పార్లమెంట్ భవనం, భారత్ మండపం, జాతీయ యుద్ధ స్మారకం, యశోభూమి కన్వెన్షన్ సెంటర్ల సరసన ఇప్పుడు కర్తవ్య భవన్ కూడా చేరింది. ఇవి సాధారణ కట్టడాలు కావు, వికసిత భారత్ భవిష్యత్తును తీర్చిదిద్దే పాలనా దేవాలయాలు" అని ఆయన పేర్కొన్నారు. 21వ శతాబ్దపు భారతదేశానికి పాతకాలపు పనివిధానాలు సరిపోవని, అందుకే ఈ పరివర్తన అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పథకాలపై సీఎం బొమ్మలు, పార్టీ గుర్తులు ఉండొచ్చు...

- మొదటి పేజీ తరువాయి

పథకాలకు జీవించి ఉన్న రాజకీయ నాయకులు, మాజీ ముఖ్యమంత్రులు లేదా పార్టీల సైద్ధాంతిక నాయకుల పేర్లు, ఫోటోలు, చిహ్నాలు వాడరాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ తీర్పుతో తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను అనుమతించింది. మద్రాస్ హైకోర్టులో ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసిన ఏఐఏడీఎంకే ఎంపీ సి.వి. షణ్ముగంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆయన పిటిషన్‌ను కొట్టివేయడమే కాకుండా, రూ. 10 లక్షల జరిమానా విధించింది.రాజకీయ నాయకుల పేర్లతో పథకాలు ప్రవేశపెట్టడం దేశవ్యాప్తంగా సర్వసాధారణంగా జరుగుతున్న విషయమని ధర్మాసనం అభిప్రాయపడింది. "అన్ని రాజకీయ పార్టీల నాయకుల పేర్లతో పథకాలు అమలులో ఉన్నప్పుడు, పిటిషనర్ కేవలం ఒకే పార్టీని, ఒకే నాయకుడిని లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజాధనం దుర్వినియోగంపై నిజంగా ఆందోళన ఉంటే, అన్ని పథకాలపైనా పిటిషన్ వేయాల్సింది" అని కోర్టు పేర్కొంది. షణ్ముగం దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) చట్ట ప్రకారం చెల్లదని, ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని ధర్మాసనం స్పష్టం చేసింది.ముఖ్యమంత్రి స్టాలిన్ పేరుతో ఉన్న 'ఉంగళుదన్ స్టాలిన్' (మీ స్టాలిన్) పథకాన్ని సవాల్ చేస్తూ ఏఐఏడీఎంకే ఎంపీ షణ్ముగం మొదట కేంద్ర న్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కేవలం మూడు రోజులకే మద్రాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు, జూలై 31న ప్రభుత్వ పథకాలకు రాజకీయ నాయకుల పేర్లు, ఫోటోలు వాడరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, తాజాగా అనుకూల తీర్పు వెలువడింది.

## సబితా ఇంద్రారెడ్డికి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలి

- మొదటి పేజీ తరువాయి

మంత్రి సమక్షంలో సబితపై కాంగ్రెస్ నేతలు గూండాల మాదిరి వ్యవహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతుంటే... పోలీసులు వారితో కలిసి సబితపై దౌర్జన్యానికి పాల్పడటం దారుణమని అన్నారు. సబిత పట్ల అమర్యాదగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోంమంత్రిగా కూడా ఉన్న రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని అన్నారు. రౌడీ మూకల దాడులకు బీఆర్ఎస్ పార్టీ భయపడదని చెప్పారు. ప్రజాక్షేత్రంలో మీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని అన్నారు.

## భారత్ పై మరో 25 శాతం సుంకం విధించిన ట్రంప్

- మొదటి పేజీ తరువాయి

రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తున్న భారత్‌పై అమెరికా కఠిన వైఖరి అవలంబించింది. భారతదేశం నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 25 శాతం టారిఫ్ (సుంకం) విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) సంతకం చేశారు. గత వారం ప్రకటించిన 25 శాతం సుంకానికి ఇది అదనం కావడం గమనార్హం.ఉక్రెయిన్‌పై సైనిక చర్య నేపథ్యంలో రష్యాపై విధించిన ఆంక్షలను మరింత బలోపేతం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్ హౌస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. భారతదేశం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకోవడం తమ జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి ముప్పుగా పరిగణిస్తున్నట్లు అమెరికా పేర్కొంది. "అందువల్ల, వర్తించే చట్టాలకు అనుగుణంగా, యునైటెడ్ స్టేట్స్ కస్టమ్స్ భూభాగంలోకి దిగుమతి అయ్యే భారతీయ వస్తువులపై 25 శాతం అదనపు సుంకం విధించబడుతుంది" అని ఉత్తర్వులో స్పష్టం చేశారు.ఈ కొత్త సుంకాలు ఉత్తర్వుపై సంతకం చేసిన 21 రోజుల తర్వాత అమెరికాలోకి ప్రవేశించే అన్ని అర్హత కలిగిన భారతీయ వస్తువులపై అమల్లోకి వస్తాయి. అయితే, ఈ గడువుకు ముందే రవాణాలో ఉండి, సెప్టెంబర్ 17వ తేదీలోపు కస్టమ్స్ క్లియరెన్స్ పొందే సరుకులకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు కల్పించారు. ఇప్పటికే ఉన్న సుంకాలను యథాతథంగా కొనసాగిస్తూ, ఈ కొత్త టారిఫ్‌లను అదనంగా విధించనున్నారు.ఈ ఉత్తర్వులకు లోబడి ఉన్న వస్తువులు కఠినమైన కస్టమ్స్ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. వాటిని అమెరికాలోని విదేశీ వాణిజ్య జోన్లలో 'ప్రివిలేజ్డ్ ఫారిన్ స్టేటస్' కింద మాత్రమే అనుమతిస్తారు. మారుతున్న పరిస్థితులు, ప్రభావిత దేశాల ప్రతిచర్యలు లేదా రష్యా, భారత్ విధానాలలో గణనీయమైన మార్పుల ఆధారంగా ఈ ఉత్తర్వును సవరించే అధికారాన్ని ట్రంప్ తన వద్దే ఉంచుకున్నారు.ఇదే సమయంలో, రష్యాతో ఇతర దేశాల చమురు వాణిజ్యాన్ని నిశితంగా గమనించాలని, అవసరమైతే ఇలాంటి చర్యలనే సిఫారసు చేయాలని వాణిజ్యం, విదేశాంగ, ట్రెజరీ వంటి కీలక విభాగాలను ట్రంప్ ఆదేశించారు.

## రూ.260 కోట్ల మెగా సైబర్ స్కామ్.. ఈడీ దర్యాప్తులో బయటపడ్డ క్రిప్టో హవాలా దందా!

- మొదటి పేజీ తరువాయి

భాగంగా దాదాపు 11 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు అధికారులు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రాము, డెహ్రాడూన్ ప్రాంతాల్లో రూ.260 కోట్ల స్కామ్ కి సంబంధించిన రైడ్స్ చేపట్టింది. నేరగాళ్లు ప్రజల నుంచి డబ్బు కాజేయటానికి పోలీసు అధికారులమని, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లమంటూ బెదిరింపులకు పాల్పడి వారి నుంచి డబ్బు కాజేసినట్లు సీబీఐ, ఢిల్లీ పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనిపై రంగంలోకి దిగిన ఈడీ నిందితులు ఈ డబ్బును అక్రమంగా విదేశాలకు హవాలా రూపంలో క్రిప్టో కరెన్సీ రూపంలో తరలించటం ద్వారా మనీలాండరింగ్ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించింది. కొన్ని కేసుల్లో నేరగాళ్లు తాము మైక్రోసాఫ్ట్, అమెజాన్ టెక్ ప్రతినిధులమని సహాయం చేసేందుకు కాల్ చేసినట్లు నమ్మబలికి వారి నుంచి డబ్బు కాజేసినట్లు పోలీసులకు తెలిసింది. సైబర్ నేరగాళ్లు తాము చేపట్టిన నేరాల నుంచి వచ్చిన డబ్బును క్రిప్టోలుగా మార్చి అనేక వాలెట్లలోకి పంపినట్లు గుర్తించారు అధికారులు. బిట్ కాయిన్ల రూపంలో వాటిని స్టోర్ చేసి ఆ తర్వాత వాటిని క్రిప్టో కరెన్సీల్లో టెథర్ అనే స్టేబుల్ కాయిన్ గా మార్చారు. అక్కడి నుంచి హవాలా మార్గంలో యూఏఈలోని ఆపరేటర్ల ద్వారా క్యాష్ గా మార్చుకున్నట్లు దర్యాప్తులో తేలింది.

## ఆత్మకూర్(%ం%) మండలం నెమ్మికల్ రామయ్య ఫంక్షన్ హాల్ లో రేపు ఉదయం 11 గంటలకు ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది.

ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా
%ూాఅఎఎ% సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి గారు
సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణా రెడ్డి గారు
జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ గారు
జిల్లా కలెక్టర్ తేజస్ నంద్లాల్ పవార్ గారు తదితరులు హాజరవుతున్నారు.

కందాల వెంకటరెడ్డి
మండల కాంగ్రెస్ అధ్యక్షులు
ఆత్మకూర్(%ం)

## ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నాయిని ధర్మ పాల్ రెడ్డి గారు షూటై బెల్టు లను విద్యార్థులకు ఎంఈఓ గారి చేతుల మీదుగా ఉచితంగా అందజేశారు



హైదరాబాద్ పెన్ పవర్:

ఈరోజు ప్రాథమిక పాఠశాల పల్లెర్లలో స్కూల్ విద్యార్థులకు పల్లెర్ల గ్రామవాసి అయిన నాయిని ధర్మపాల్ రెడ్డి గారు 30 వేల రూపాయల విలువ గల షూ, టై బెల్టులను ఉచితముగా అందజేసిన వస్తువులను ఎంఈఓ చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి సోమయ్య సహోపాధ్యాయులు మోహన్ గారు వేణు గారు పాల్గొనడం జరిగింది

## దివికి ఎగసిన ఎరుపు చుక్క.

- శోకసంద్రంలో మణుగూరు ప్రజలు.
- పేద ప్రజల నాయకుడు అయోధ్య.

హైదరాబాద్ పెన్ పవర్:




మణుగూరు సిపిఐ పార్టీ నేత గోల్డ్ అయోధ్య చారి బుధవారం సూర్యాపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మణుగూరు మండల వ్యాప్తంగా ఏ సమస్య వచ్చినా నేనున్నాను అంటూ ఎర్ర జెండా సాక్షిగా ప్రభుత్వాలను సైతం సవాలు చేస్తూ ప్రజల పక్షాన నిలబడిన ఏకైక వ్యక్తి అయోధ్య గత కొన్ని సంవత్సరాలుగా అధికారం లేకపోయినా ప్రజలే నా బలం అనుకుంటూ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ అనేక వేల ఎకరాల భూములను సైతం ప్రజలకు అందించడంలో అయోధ్య పాత్ర ఎంతగానో ఉన్నది. ప్రజల కొరకు అధికారులను సైతం గడగడలాడించిన ఎరుపు చుక్క బుధవారం నాడు నేలరాలడంతో మణుగూరు వ్యాప్తంగా సంఘీభావం తెలపడంతో పాటు బందు ప్రకటించారు. తాను నిర్వహించిన పోరాటంలో గ్రామాలు సైతం తన పేరును గ్రామం పేరుగా పెట్టుకున్న సంఘటనలు కూడా లేకపోలేదు. అలాంటి పేరుగాంచిన ఉద్యమ నేత నేలరాడడంతో తాను చేసిన పోరాటాలు ఉద్యమాలు స్ఫూర్తితో వివిధ రాజకీయ, సంఘాల నుంచి పెద్ద ఎత్తున తమ సంతాపాన్ని తెలియజేస్తూ జోహార్ అయోధ్య, అయోధ్య అమర్ రహే అంటూ నినాదాలు నిర్వహించారు.

## నూతన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాన్ని పరిశీలించిన, తిమ్మాయిపల్లి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు




హైదరాబాద్ పెన్ పవర్: :కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఇందిరమ్మలో ఇండ్ల నిర్మాణంలోని భాగంగా చేగుంట మండలం ఉల్లి తిమ్మాయిపల్లి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు చేగుంట మండల కేంద్రంలోని నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు ను గ్రామ కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలో ఇందిరమ్మ లబ్ధిదారులు సందర్శించారు, ఇందిరమ్మ ఇళు చాలా బాగుంది అని లబ్ధిదారులు సంతోషం వ్యక్తపరిచారు ఈ యొక్క ఇల్లు నిర్మాణం 44 గజాలలో నిర్మించారు అని వారు తెలిపారు

ఈ కార్యక్రమంలో తిమ్మాయిపల్లి కార్యదర్శి స్వాతి, కాంగ్రెస్ నాయకులు, పుట్ట రాకేష్,కిషన్, సురేష్, శ్రీను, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు,పద్మ, పెంటమ్మ రాము,రాజు,పూజ,నవీన్, అనసూయ,నవీన్, రాకేష్ తదితరుల పాల్గొన్నారు

# బంగారం చోరీ కేసులో మహిళా అరెస్ట్..

- దొంగలించబడిన సొత్తు స్వాధీనం.
- రిమాండ్ నిమిత్తం ఖమ్మం జిల్లా కోర్టులో హాజరపరిచిన ఎస్సై కూచిపూడి జగదీష్.

హైదరాబాద్ పెన్ పవర్:

చోరీ కేసులో ఓ మహిళలను బుధవారం తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్టు చేశారు. తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపిన వివరాలివీ..మే 23న తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని పగిళ్ల రామకృష్ణ ఇంట్లో బంగారం, వెండి వస్తువులు ( బంగారపు నెక్లెస్ -1, ఉంగరాలు -2, చెవిదిద్దులు -2, మాటీలు -2, ఒక జత వెండి పట్టీలు, వెండి మొలత్రాడు -1) సుమారుగా లక్ష రూపాయల విలువ గల బంగారు, వెండి వస్తువులు దొంగిలించబడినవి.దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల ఎంక్వయిరీ లో భాగంగా డోర్నకల్ మండలానికి చెందిన మహిళను పట్టుకొని విచారించగా, తనే చోరీ చేసినట్లు ఒప్పుకున్నది. దొంగిలించబడిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలుని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం ఖమ్మం జిల్లా కోర్టులో హాజరపరిచారు.




## వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి.



హైదరాబాద్ పెన్ పవర్:

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ.

8వేల కోట్ల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి రామన్నపేటలో ధర్నా

పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్

రామన్నపేట: విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిల మీద రాజ్యసభ %వీ% ఆర్ కృష్ణన్న ఆదేశాల మేరకు బీసీ విద్యార్థి సంఘం రామన్నపేటలో విద్యార్థులతో కలిసి మహాధర్న నిర్వహించారు విద్యార్థుల ఫీజు రీయంబర్స్మెంట్ చెల్లిస్తే కమీషన్లు రావని.. అదే కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తే 20% నుంచి 30 %శాతం కమీషన్లు వస్తాయని.. అందుకే 30 లక్షల నిరుపేద విద్యార్థులకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించడం లేదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ ఆరోపించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఎనిమిది 8 వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని రామన్నపేటలో కాలేజీ బాయ్స్ గర్ల్స్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలి ఫీజ్ రీయంబర్స్మెంట్ స్కీమ్ను ఎత్తేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని ఆయన స్పష్టం చేశారు. చాలాకాలంగా పెండింగ్లో ఉన్న రూ. 8వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఒకవైపు ఫీజు బకాయిలు చెల్లించకుండా మరోవైపు ఫీజుల స్కీములను ఎత్తేయడానికి ట్రస్ట్ బ్యాంకును ఏర్పాటు చేసి, దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామన్న కొత్త నాటకంకు తెర లేపారని ఆరోపించారు. ప్రభుత్వ నాయకుల జీతాలకు పెట్టుకోండి ట్రస్ట్ బ్యాంక్ ఈ ప్రతిపాదన ఎట్టి పరిస్థితు ల్లోనూ అంగీకరించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించక బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారని.. ఉన్నత చదువులు మానేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుసున్నా కనీసం రూ.20 రూపాయలు కూడా విద్యార్థులకు చెల్లించలేదన్నారు.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ కాలేజీ హాస్టళ్లలో సీట్లు లభించక విద్యార్థులు రైల్వేస్టేషన్, బస్టాం డ్లలో స్నానాలు చేస్తూ రాత్రివేళ అక్కడే పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కొత్తగా రాష్ట్రంలో 100 బీసీ కాలేజీ హాస్టళ్లను మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న హాస ళ్లలో 20 శాతం సీట్లు పెంచాలని కోరారు. విద్యార్థులకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి ప్రతి విద్యార్థికి ఐదు లక్షల భరోసా కార్డు ఇవ్వాలి సంక్షేమస్టలకు సొంత భవనాలు నిర్మించాలి ఫీజు రీయింబర్స్ స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలి విద్యార్థుల అన్ని సమస్యలు వెంటనే పరిష్కరించలి లేని ఎడల రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు చేసి రాష్ట్ర ప్రభుత్వంని అట్టుడికి ఇస్తామని హెచ్చరించారు ఈ సమావేశంలో ఎడ్ల మహాలింగం,మోటె నవీన్, మాదం లింగస్వామి,, మైపాల్ రెడ్డి, రజాక్, ఉపేందర్,దీపక్, ప్రవీణ్, వైష్ణవి, రమాదేవి, విష్ణు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్.





- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

హైదరాబాద్ పెన్ పవర్:

తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణు గోపాల్ తో కలిసి పాల్గొని,జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగ లాగా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపట్టానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదని, 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచి సలహాదారులుగా పని చేశారని, తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని, స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసారని, రాష్ట్ర అభివృద్ధి కొరకు మంచి ప్రణాళికలు సైతం రూపొందించారని , ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి, డి సి ఓ రుక్మిణి మరియు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ జయంతి వేడుకలు తాసిల్దార్ కార్యాలయంలో నివాళ్ళు అర్పించిన, ఎమ్మార్వో శ్రీకాంత్




హైదరాబాద్ పెన్ పవర్:

చేగుంట మండల కార్యాలయంలో బుధవారం నాడు ప్రొఫెసర్ శ్రీ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలు తహసిల్దార్ కార్యాలయం నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్, సాహిత్య సేవ, భావజాల వ్యాప్తి మొదలైన వాటిని తెలంగాణ తొలి దశ ఉద్యమం మరియు మలిదశ ఉద్యమంలో వాటి పాత్ర గురించి కొనియాడడం జరిగింది. ప్రొఫెసర్ జయశంకర్, జయంతి పురస్కరించుకొని వారికి మనస్పూర్వక నివాళులు అర్పించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో చేగుంట మండల్ తాసిల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ జయభారత్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రగాఢ సానుభూతి



హైదరాబాద్ పెన్ పవర్:

(గౌషి తండా) కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధరావత్ నంద్యా నాయక్ గారు,అనారోగ్యం తో మరణించడం జరిగింది. వారి కుటుంబానికి ముక్కుడుదేవుల పల్లి మాజీ సర్పంచ్ ఫయాజ్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## గ్రామీణ ప్రజలకు వైద్యం అందించడంలో ఆర్.ఎం.పి, పి.ఎం.పిల పాత్ర ముఖ్యమైనది:

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

దేగల అంజయ్య యాదవ్.



హైదరాబాద్ పెన్ పవర్:

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం.

ఆర్ఎంపీ,పీఎంపీలకు విధివిధానాలు ప్రకటించి గ్రామాల్లో వైద్యం చేసేందుకు గుర్తింపు సర్టిఫికెట్ జారీ చేయడానికి కృషి చేస్తున్న ఈ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం వలిగొండ మండల మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు దేగల అంజయ్య యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామీణ ప్రజలకు వైద్యం అందించడంలో ఆర్.ఎం.పి, పి.ఎం.పిల పాత్ర ముఖ్యమైనదన్నారు. గత ప్రభుత్వ హాయంలో వీరిసేవలను పట్టించుకోక పోవడం విచారకరమన్నారు.గతంలో చాలామందికి పరీక్షలు నిర్వహించి కూడా సర్టిఫికెట్లు ప్రధానం చేయలేదన్నారు.తమకు విధించిన నియమాల ప్రకారమే వైద్యాన్ని అందిస్తామన్నారు ఈ ప్రభుత్వం తమను గుర్తించి వైద్య సేవలు అందించేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వృత్తి పై ఎంతో మంది జీవనోపాధి పొందుతూ.అనేక గ్రామాలలో ప్రజల ప్రాణాలనుకాపాడుతున్నామన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామీణ వైద్యులకు అండగా నిలిచిన నేత అని గుర్తు చేశారు ప్రజా పాలన ప్రభుత్వములో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తున్న సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేశారు

# మంగపేటలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు..

హైదరాబాద్ పెన్ పవర్:



ములకలపల్లి మండలం మంగపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ తో కలిసి బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు మరియు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం తదితర సేవల గురించి అంగన్వాడీ టీచర్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్నటువంటి గుడ్లను మరియు ఇతర ఆహార పదార్థం నిల్వలను పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ టీచర్ ను సి హెచ్ ఆర్ క్రింద పిల్లలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు? గర్భిణి స్త్రీలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు? గర్భిణీల లో రక్తహీనత లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది ద్వారా గర్భిణీలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భిణీలు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ లేకపోవడం వలన కోతులు మరియు పాముల వల్ల ఇబ్బందులకు గురి అవుతున్నామని కలెక్టర్ దృష్టికి అంగన్వాడీ సిబ్బంది తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్ మట్టి ఇటుకలతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం మంగపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి, విద్యార్థుల పుస్తక పఠనం మరియు చేతిరాతను కలెక్టర్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను కలెక్టర్ మెనూ ప్రకారం ఉన్నాయా లేదా అని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదిలలో జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి ముచ్చటించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యంపై పలు ప్రశ్నలు వేసి బోర్డు పై రాయించి విద్యార్థుల సామర్థ్యాన్ని మరియు వారి యొక్క చేతిరాతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు మరియు పెన్నులు బహుకరించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలోప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనవని అన్నారు. అదేవిధంగా పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు. రోజువారి మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు కింద కూర్చొని ఉండటాన్ని గమనించి పాఠశాలకు త్వరలో అవసరమైన బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు.

మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల హాజరు, ఓపీ, రిజిస్ట్రేషన్ కౌంటర్,ల్యాబ్,ఇన్ పేషంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఔషధ నిల్వలు రిజిస్టర్ను కలెక్టర్ పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగంలో రోగులకు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని,ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ గన్యా, ప్రధానోపాధ్యాయురాలు కోటమ్మ, అంగన్వాడి టీచర్ సుజాత మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్న వస్త్రాలు కావాలి అన్వాయిదాలు కాదు.





హైదరాబాద్ పెన్ పవర్:

ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, ఆగస్టు 6 జన విజ్ఞాన వేదిక ధర్మసాగర్ మండల వార్షిక సభ ప్రధానోపాధ్యాయులు ధర్మ ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు ."ప్రపంచ శాంతి కోసం సైన్స్ "అను అంశాల నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు కవితల ,ద్వారా ఉపన్యాసాల ద్వారా ప్రపంచ శాంతికి మనమంతా కట్టుబడి ఉండాలని తెలిపారు .ఈ సదస్కు ముఖ్యఅతిథిగా, ప్రధాన వక్తగా హాజరైన విశ్రాంత అటవీ అధికారి కాజీపేట పురుషోత్తం మాట్లాడుతూ హిరోషిమా, నాగసాకిలపై అన్వర్ణ దాడులు ప్రపంచ మానవ చరిత్రలో అత్యంత విషాదకరమైన సంఘటన. దీనివల్ల వేలాది మంది మానవులు చనిపోవడం అత్యంత బాధాకరం. మానవ అభివృద్ధికి ,సంక్షేమానికి కావాల్సింది అన్న వస్త్రాలు కానీ అన్వాయిదాలు కాదు. శాస్త్ర సాంకేతిక ఫలాలు మానవ ప్రగతికి తోడ్పడాలి కానీ వినాశనానికి కాదు అన్నారు. సదస్సు సమన్వయకర్త సురేష్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు జన విజ్ఞాన వేదిక ధర్మసాగర్ మండలంలో గత సంవత్సర కాలంగా చేసిన కార్యక్రమాల నివేదికను తెలిపారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయురాలు కవితా దేవి మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్వహించే ఇలాంటి వైజ్ఞానిక సదస్సులు విద్యార్థుల్లో బాల్య దశలోనే ప్రశ్నించే తత్వము, శాస్త్ర దృక్పదము పెంపొందేలా చేస్తాయని అన్నారు . కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, కిరణ్మయి ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జయశంకర్ సార్ జయంతి వేడుకలు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రం ఉపాధ్యక్షులు జోగు అంజన్న సమక్షంలో.



హైదరాబాద్ పెన్ పవర్:

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న ఆధ్వర్యంలో వలిగొండ మండల కేంద్రంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జయంతి ఉత్సవాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ సార్ అహర్నిశలు తెలంగాణ కొరకు కృషి చేసిన వ్యక్తిగా తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ఆయన తొలిదశ మలిదశ ఉద్యమంలో పాల్గొని ఎన్నో పోరాటాలు చేసి అవమానాలను భరించి తెలంగాణ సాధనకు మార్గదర్శకుడుగా ఉండి విద్యార్థి దశలోనే ఎన్నో పోరాటాలు చేసి ప్రిన్సిపాల్ గా ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి తెలంగాణను సాధించడానికి అనునిత్యం కృషిచేసి మహా వ్యక్తి అని తెలంగాణను సాధించడమే ధ్యేయంగా పెట్టుకొని ఆ దిశ గా అడుగులు వేసి తెలంగాణను సాధించడానికి కృషి చేసిన వ్యక్తులలో మొట్టమొదటి వ్యక్తిగా ఆయనను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని కొనియాడారు, ఆయన ఆశయాలు కొనసాగించాలని అన్నారు..

ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి గౌరవ సలహాదారు కళ్లెం లక్ష్మారెడ్డి సీనియర్ నాయకులు కొండూరు సత్తయ్య కొండూరు శ్రీరాములు దండ మల్లికార్జున్ ఎక్కడ దేవి శ్రీనివాస్ శీలం ఇందిరా మండల మహిళా అధ్యక్షురాలు ఐటిపాముల పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# కుప్పెనకుంట్ల బీసీ గర్ల్స్ హాస్టల్ ను పరిశీలించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్



హైదరాబాద్ పెన్ పవర్: సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలం లో కుప్పనకుంట్ల బీసీ గర్ల్స్ హాస్టల్ మధ్యాహ భోజనం ను స్వయంగా పరిశీలించి, విద్యార్థినలతో కలిసి మధ్యాహ భోజనం చేశారు

ప్రతి హాస్టల్ లో ప్రతి రోజు భోజన సమయం లో వంట గదిలో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలి అని, నాణ్యమైన కూరగాయలు, నిత్యావసర సరుకులు వాడాలి అని వంట మెస్సి కి, ప్రధాన ఉపాధ్యాయులకు మరియు కాంట్రాక్టర్ కు పలు సూచనలు తెలియజేశారు

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల చిన్నారులకు నాణ్యమైన భోజనం, చదువు అందించాలి అని ఉద్దేశం తో డైట్ చార్జీలు, క్యాస్మోటిక్ చార్జీలు ఎన్నడూ లేని విధంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పెంచటం జరిగిందాని డాక్టర్ మట్టా దాయనంద్ తెలియజేశారు

ఈ కార్యక్రమం లో పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు,సత్తుపల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాథ్, సత్తుపల్లి ఏ ఎం సి చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఏ ఎం సి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు,సీనియర్ నాయకులు టేకులపల్లి శ్రీనివాస్ రెడ్డి, సీతా రాములు, చిన్న స్వామి,చీకటి రామారావు, కరీముల్లా, పెనుబల్లి మండలం, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు పాల్గొన్నారు

# పార్లమెంట్ లో కేంద్రమంత్రులు జెపి నడ్డా మరియు నిర్మలా సీతారామన్ కలిసిన మంత్రి తుమ్మల

- ఆగస్టు నెల కేటాయింపులు మరియు ఏప్రిల్ నుండి జులై వరకు ఏర్పడిన లోటు యూరియాను ఈ నెల కేటాయింపులతో పాటే కలిపి వెంటనే సరఫరా చేయాలని జెపి నడ్డా ని కోరిన మంత్రి తుమ్మల
- క్రూడ్ పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని నిర్మలా సీతారామన్ ని కోరిన మంత్రి తుమ్మల



హైదరాబాద్ పెన్ పవర్: 43 శాతం రిజర్వేషన్లు కల్పించేలా ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ఈ రోజు ధర్నాకు హాజరైన మంత్రి తుమ్మల గారు, పార్లమెంట్ లో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారం రావాల్సిన యూరియాను వెంటనే సరఫరా చేయాలని కోరడం జరిగింది. ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు యూరియా సరఫరాలో ఏర్పడిన లోటును కూడా ఆగస్టు నెల కేటాయింపులతో పాటే సరఫరా చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ఆలస్యం తలెత్తితే రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని కేంద్ర మంత్రి నడ్డాగారి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని.. కేటాయించిన యూరియాను తక్షణమే సరఫరా చేయాలన్నారు. ఏప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, ఈ యూరియాను కూడా ఆగస్టు నెల కేటాయింపులతో పాటే వెంటనే సరఫరా చేయాలని అన్నారు.

అదేవిధంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ని కలిసి, క్రూడ్ పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని మార్చి 2018 లో ఉన్నట్టుగా 44 శాతానికి పెంచాలని కోరడం జరిగింది. క్రూడ్ పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుండి 16.5 శాతం తగ్గించడం వలన ఆయిల్ పామ్ గెలల ధర తగ్గడంతో పాటు , ఇది ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహకానికి అడ్డంకిగా మారనుందని మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లారు. ఇంతకుముందుకే దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుండి 44 శాతానికి పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యర్థించినట్టు గుర్తుచేశారు. ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రాలు, రైతులకు తగిన ప్రోత్సహకాలు కల్పిస్తూ, ఈ పంట సాగు పెంపుపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయంపై మరోసారి పునః సమీక్షించాలని మంత్రి కోరడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత పథకమైన పథకంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆయిల్ ప్లాంటేషన్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయం వలన రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకోసం చేస్తున్న కార్యక్రమాలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ విషయాలన్నింటిని దృష్టిలో ఉంచుకొని క్రూడ్ పామాయిల్ పై తగ్గించిన దిగుమతి సుంకాన్ని తిరిగి మరల 44 శాతానికి పెంచాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ని కోరారు. మంత్రితో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి నివాళి వర్తించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో గల ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు ప్రొఫెసర్ జయశంకర్ సార్ గారు తెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం ఆయన జీవితాన్ని త్యాగం చేశారని కొని ఆడారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్ మండల పార్టీ అధ్యక్షులు పరమేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్,పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్ మాజీ ఎంపీటీసీ లు ముజామిల్, భూపాల్, బక్షిరామ్, మండల పార్టీ యువత ఉపాధ్యక్షులు నర్సింలు ముదిరాజ్, నర్సింలు యాదవ్, అధ్యక్షులు మచ్చేందర్, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గోపాల్,నాయకులు సురేష్, అశోక్ రెడ్డి, గణపతి, తదితరులు ఉన్నారు.

# ప్రముఖ ఆంధ్రప్రభ విలేకరి అమ్మ దశ దీన కర్మ కార్యక్రమం లో పాల్గొన్న... డాక్టర్ మట్టా దయానంద్

హైదరాబాద్ పెన్ పవర్:



సత్తుపల్లి ప్రముఖ ఆంధ్రప్రభ సీనియర్ రిపోర్టర్ ఖాదర్ బాబా అమ్మ కి " శే " లు షేక్ వలీయాంబీ దశ దీన కర్మ కార్యక్రమం లో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించరు ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏ ఎం సి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాల రాణి, మాజీ కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుల్ల నరసింహ రావు, చల్లగుల్ల కృష్ణ రావు, కమల్ పాషా, సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ మొరిశెట్టి సాంబశివరావు, ఎన్ ఎస్ యూ ఐ సత్తుపల్లి నియోజకవర్గం అధ్యక్షులు సందీప్ గౌడ్, హమీద్ మరియు సత్తుపల్లి పట్టణ మరియు మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు పాల్గొన్నారు..

# తపస్ ఆధ్వర్యంలో ఘనంగాప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు,

హైదరాబాద్ పెన్ పవర్:

తపస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ

తెలంగాణ ఉద్యమాన్ని గల్లి నుంచి ఢిల్లీ దాకా తీసుకువెళ్లిన గొప్ప వ్యక్తి అని,1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్- ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు అని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు అని, జయశంకర్ జ్ఞాపకార్థం జయశంకర్ జిల్లా ను ఏర్పాటు చేశారు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, తపస్ జిల్లా కార్యదర్శి సుమతి,భవాని, శ్రీనివాస్,రఘుపతి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# కేఎన్ఆర్ సంస్థ ద్వారా యువతకు ఉపాధి కల్పించాలి - మాజీ ఎంపి జీవీఎల్ సూచన



**గాజువాక పెన్ పవర్, ఆగస్టు 06:**పాత గాజువాక కేఎన్ఆర్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ కార్యాలయాన్ని బిజెపి మాజీ ఎంపి జీవీఎల్ నరసింహారావు సందర్శించారు. సంస్థ ప్రొప్రైటర్ కరణంరెడ్డి నరసింగరావుకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేఎన్ఆర్ ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు చేయడం శుభపరిణామం అని అన్నారు. నరసింగరావు మాట్లాడుతూ జీవీఎల్ వంటి గొప్ప జాతీయ స్థాయి నాయకులు తమ విలువైన సమయాన్ని కేటాయించి ఆశీర్వదించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సుయీ ధాగా లైఫ్ స్టైల్ రడీ మేడ్ గార్మెంట్స్ డైరెక్ట్ సెల్లింగ్ ద్వారా కొన్ని వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి డీలర్షిప్ తీసుకున్నామని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు,బొత్స దిలీప్,రంగనాయకులు,ఫణిశర్మ,నాగబాబు,కృష్ణారెడ్డి,మనోహర్ ,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తల ఆక్రందన ఇప్పటికైనను చెవినబెట్టండి

- కురుపాం కాంగ్రెస్ పార్టీ కో.ఆర్డినేటర్
- అడ్డాకుల చిన్నారావు డిమాండ్



**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 06.పెన్ పవర్.**రాష్ట్రం లో గల అంగన్వాడి కార్యకర్తలు తమకు ప్రభుత్వం అందజేసిన మొబైల్ లను మొబైల్ యాప్లను నిరసిస్తూ చేపట్టిన ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోందని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ప్రకటించారు.ఈ మేరకు బుధవారం గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రం లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అలవిగాని హామీలను మాపై గుప్పించి,తీరా అధికారం చేపట్టాక మమ్మల్ని శ్రమ దోపిడీకి గురి చేస్తోందని అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారని వివరించారు.కాగా,సమయపాలన లేని బాధ్యతల నిర్వహణ,మొబైల్ యాప్లతో తప్పని తిప్పలు,వెరసి మితిమీరిన ఒత్తిడితో శారీరక,మానసిక ఆందోళన చెందక తప్పడం లేదంటూ వాపోతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశానికి అంటుతున్నందున రూ.11వేల నెలసరి వేతనంతో పిల్లాపాపలతో మా కుటుంబాలను నెట్టుకు రావడం భారంగా ఉందని.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలు తమకునూ వర్తింప జేయక వేలకొద్ది మూలవేతనం(జీతం)అందుకుంటున్న(రెగ్యులర్)ఉద్యోగులుగా పరిగణిస్తూ,సంక్షేమానికి సైతం నోచుకోని బ్రతుకులను వీరు వెళ్ళదీస్తున్నట్లు విపులీకరించారు.అంగన్వాడీ కార్యకర్తల ఆక్రంధన ఇప్పటికైనను గుర్తెరిగి,కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు కార్యరూపం దాల్చేలా సత్వర చర్యలకు ఉపక్రమిస్తూ.ఆదుకోవాలని చిన్నారావు డిమాండ్ చేశారు.

# ఆర్థిక మోసాలపై అవగాహన...!

- మర్రిపాలెం ప్రభుత్వ మహిళ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో...



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 6:** మండలంలోని మర్రిపాలెంప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల , నాలెడ్జ్ గ్రోత్ ఫౌండేషన్, గురుగ్రమ్, హర్యానా సంయుక్త అధ్వర్యంలో ఈ నెల 8 న ఫైనాన్షియల్ లిటరసీ అనే అంశం పై జాతీయ స్థాయి వెబినర్ నిర్వహించబడుతుంది. అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ వెబినార్ లో నాలెడ్జ్ గ్రోత్ ఫౌండేషన్ ఆర్గనైజర్ కనిక గుప్త, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు బి. శేఖర్ (కామర్స్ అధ్యాపకులు), డి.శ్రీనివాసరావు (ఎకనామిక్స్ అధ్యాపకులు), ఎన్. సంతోష్ భమి రెడ్డి, రీసెర్చ్ స్కాలర్ ఆంధ్రయూనివర్సిటీ, సెబీ వారు నిర్వహించే భవిష్యత్తు ఆర్థికాభివృద్ధి,ఆర్థిక మోసాలపై అవగాహన,ఆర్థిక ప్రణాళికపై ఆచరణాత్మక జ్ఞానం,పెట్టుబడిదారులకు అలాగే పారిశ్రామికవేత్తలకు చేయాల్సినవి చేయకూడనివి,పన్ను సంబంధిత పెట్టుబడి వ్యూహాలు,పదవీ విరమణకు సురక్షిత ప్రణాళిక, విషయాలపై అవగాహన కల్పించడం కోసం నాలెడ్జ్ గ్రోత్ ఫౌండేషన్ వారు పాల్గొంటున్నారు అని కళాశాల ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా తెలియజేశారు.

# భూమి స్వాధీనంలో ఉన్న రైతులు ఆనందించేలా యాజమాన్య హక్కు పట్టాలు అందిస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా





**భిమిలి పెన్ పవర్ ఆగస్టు 6 :**
రాష్టానికే ఆదర్శంగా నిలిచేలా రామవరం, జీఎస్ అగ్రహారం గ్రామాల ల్యాండ్ పూలింగ్ చేశామని, భూమి స్వాధీనంలో ఉన్న రైతులు ఆనందించేలా యాజమాన్య హక్కు పట్టాలు అందిస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండ లం రామవరం, జీఎస్ అగ్రహారంలలో లబ్ధిదా రులకు ఎల్.పి.ఓ.సి.లను అందజేసే కార్యక్ర మానికి బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లా డుతూ ప్రభుత్వ ఇళ్ల పట్టాల అవసరాలకు మండలంలో 2 వేల నుంచి 3 వేల ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. భూమి అనేది భావోద్వేగంతో ముడిపడిన అంశమని, ఎంఐజీ హౌసింగ్ కోసం రామవరం, జీఎస్ అగ్రహారం రైతులందరూ ఏకతాటిపైకి వచ్చి ల్యాండ్ పూలింగ్ కోసం మొత్తం 230 ఎకరాల భూము లివ్వడమనేది ప్రశంసనీయమన్నారు. వి.ఎం. ఆర్.డి.ఎ. లే అవుట్ వల్ల చుట్టు పక్కల భూముల ధరలు బాగా పెరుగుతాయని తెలిపారు. వైసీపీ హయంలో తంగుడిబిల్లిలో 700 ఎకరాల్లో తాగునీరు.. రోడ్లు.. కరెంట్.. హాస్పటల్.. డ్రైనేజ్.. వంటి కనీస మౌలిక వసతులు కల్పించకుండా, సెంటు భూముల్లో పిచ్చుక గూళ్ల లాంటి ఇళ్లు నిర్మించారని విమర్శించారు. విశాఖలో టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వ వంటి అనేక ఐటీ పరిశ్రమలు రానున్నా యని, తర్లువాడలో 200 ఎకరాల్లో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుందని వివరించారు. ఒక వైపు బీచ్, మరో వైపు నేషనల్ హైవే ఉన్నం దున భీమిలి పరిసరాలు శరవేగంతో అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ఎంవీపీ కాలనీ, సాగర్ నగర్ వంటి రెసిడెన్షియల్ శాటిలైట్ టౌన్ షిప్ లు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్య కత ఉందన్నారు. నియోజకవర్గం పరిధిలోని 7 ఇనాం గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరముందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ఆక్రమణలో ఉన్న వారికి కూడా పరిహారం ఇచ్చేలా ప్రభు త్వానికి లేఖ రాశామన్నారు. కార్యక్రమంలో వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీఓ కె. సంగీత్ మాధుర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల నాగ సందీప్, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, కూటమి నాయకులు సుభాష్ చంద్రబోస్, కె. రామస్వామి నాయుడు, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, శ్రీకాంత్ రాజు, గంగ్రెడ్డి సోమినాయుడు, పాం డ్రంగి అప్పలరాజు, శాఖారి శ్రీనివాస్, బలిరెడ్డి మల్లికార్జునరావు, కసిరెడ్డి దామోద రరావు, కాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీలో చేరిన పాలవలస ఎంపీటీసీ శ్యామల**

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. పాలవలస ఎంపీటీసీ రౌతు శ్యామల, ఉప సర్పంచ్ చందక ఎల్లారావు, వార్డు సభ్యురాలు నిమ్మల లక్ష్మీ, రౌతు వెంకట్రావు, కంచుబోయిన తమ్మినాయుడు, రౌతు పెద వెంకట్రావు, పేడా శంకర్రావు, మామిడి ఉదయ్ శంకర్, రౌతు రమణ, మదపాడ శ్రీను, ఈగల అప్పలనాయుడు, ముద్దాడ సన్యాసిరా వు, కరకాన సత్తిబాబు, అలమండ రమణ తదితరులు టీడీపీ జెండా కప్పుకున్నారు.

# మహిళా విద్యకు అత్యున్నత సంస్థగా విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల





- అటానమస్ తన స్వర్ణోత్సవాలను ఘనంగా
- ఉత్సవాలకు నాంది పలుకుతూ,స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**విశాఖ దక్షిణం పెన్ పవర్, ఆగస్టు 6 :**విశాఖపట్నం నడిబొడ్డున మహిళా విద్యకు అత్యున్నత సంస్థగా పేరొందిన విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) తన స్వర్ణోత్సవాలను ఘనంగా జరుపుకుంటోంది. ఈ ఉత్సవాలకు నాంది పలుకుతూ, స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం, మరియు కొత్త పరిశ్రమ-సంబంధిత విద్యా కార్యక్రమాల ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ వంశీ కృష్ణ శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.1975లో కేవలం మూడు కోర్సులతో, కొద్దిపాటి విద్యార్థినులతో ప్రారంభమైన ఈ కళాశాల, గత 50 ఏళ్లుగా ఎంతోమంది మహిళలకు ఉన్నత విద్యను అందిస్తూ వస్తోంది. నేడు, ఇది 25 విభిన్న కోర్సులను అందిస్తూ, 2,000 మందికి పైగా విద్యార్థినుల విద్యా అవసరాలను తీరుస్తోంది. విద్యారంగంలో కళాశాల యొక్క అద్భుతమైన కృషికి గుర్తింపుగా, ఇటీవల %చీూూజ% నుండి %ూ%ం గ్రేడ్ లభించడమే కాకుండా, అటానమస్ హోదా కూడా పొందింది. ఇది నిరంతర నాణ్యమైన విద్యకు నిదర్శనం.

'గతాన్ని గౌరవించుకుంటూ, వర్తమానాన్ని వేడుక చేసుకుంటూ, భవిష్యత్తు మహిళా విద్యకు వెలుగులు నింపేందుకు' నిర్వహించిన ఈ పోస్టర్ ఆవిష్కరణ వేడుకకు విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల గారు తన స్వాగత ఉపన్యాసంలో, గత ఐదు దశాబ్దాలుగా కళాశాల సాధించిన ప్రగతిని, ఎందరో మహిళలను శక్తిమంతులుగా తీర్చిదిద్దడంలో దాని పాత్రను వివరించారు.

ముఖ్య అతిథి శ్రీ వంశీ కృష్ణ శ్రీనివాస్ గారు తమ స్ఫూర్తిదాయక ప్రసంగంలో, బలమైన సమాజాన్ని, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడంలో మహిళా విద్య కీలక పాత్ర పోషిస్తుందని నొక్కి చెప్పారు. విద్యకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను పునరుద్ఘాటిస్తూ, కళాశాల అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం వంశీ కృష్ణ శ్రీనివాస్ స్వర్ణోత్సవాల పోస్టర్ను ఆవిష్కరించి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా, కళాశాల రెండు కొత్త అప్రెంటీస్షిప్-ఎనేబుల్డ్ డిగ్రీ ప్రోగ్రామ్లను ప్రారంభించింది: బి. కమ్ - బ్యాంకింగ్ %డ% ఫైనాన్స్ సర్వీసెస్ మరియు ఇన్సూరెన్స్) మరియు బిబిఏ లాజిస్టిక్స్. ఈ కోర్సులు విద్యార్థినులకు పరిశ్రమకు అవసర మైన నైపుణ్యాలను అందించి, వారు ఉద్యోగాని కి సిద్ధంగా ఉండేలా రూపొందించబడ్డాయి. అలాగే, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ బ్రోచర్ను కూడా విడుదల చేసి, యువ మహిళలను ఈ విద్యా ప్రయాణంలో భాగం కావాల్సిందిగా ఆహ్వా నించారు.పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా కొత్త తరగతి గదుల నిర్మాణానికి కళాశాల సిబ్బంది చేసిన విజ్ఞప్తికి వంశీ కృష్ణ శ్రీనివాస్ వెంటనే స్పందించి, కళాశాల ప్రాంగ ణంలోని నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. అనంతరం, కళాశాల మౌలిక సదుపాయాల కల్పనకు తమ నిబద్ధతను చాటుతూ, ప్రాజె క్టుకు సంబంధించిన వివరణాత్మక అంచనాను సిద్ధం చేయాలని ఒక సివిల్ ఇంజనీర్ను సూచ నలు ఇచ్చారు

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి వంశీ కృష్ణ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల , విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కె. విజయ, రూపా, కార్పొరేట ర్ శ సాదిక్, శివ ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు డా. టి.ఎం. నివేదిత, బి. సంతోషి అనుష, డా. ఆర్. కిరణ్మయి, డి. అరుణ పద్మ, డా. పి.ఎల్. శరణ్య, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, మరి యు విద్యార్థినులు హాజరయ్యా రు.చివరగా, ముఖ్య అతిథి వంశీ కృష్ణ శ్రీనివాస్కి ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది జ్ఞాపికను అందించి, వారి ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్ హెచ్ 516ఈ ఆర్వోఎఫ్ఆర్ భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం.



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగష్టు 6:** జాతీయ రహదారి 516ఇ రోడ్డు నిర్మాణంలో పెదవలస నుండి చాపరాతిపాలెం వరకు రహదారి భూ సేకరణలో ఆర్వోఎఫ్ఆర్ భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని మండల తహశీల్దార్ హెచ్.అన్నాజీ రావు తెలియజేశారు.పాడేరు సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పెదవలసలో భూములు కోల్పోయే రైతులతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భూ సేకరణలో ఆర్వోఎఫ్ఆర్ భూములు కోల్పోయే రైతులు ఆందోళన చెందే అవసరం లేదని చెప్పారు. బాధితుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రైతులు కోరే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లకే బాలమజ్జి, మండల సర్వేయర్ శ్రీను, వీఆర్ఓ సత్యమణి పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో ఐదు, తొమ్మిది మిగిలిన సీట్ల భర్తీ కి ఆహ్వానం

- కొయ్యూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింగరావు వెల్లడి



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 6 :** మండలంలోనికొయ్యూరు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్ల కు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ నరసింగరావు వైస్ ప్రిన్సిపాల్ మోహన్ కోరారు. బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐదవ తరగతిలో 27 సీట్లు, తొమ్మిదవ తరగతిలో ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయని వారు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పది రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు మరిన్ని వివరాలకు పాఠశాలను సంప్రదించాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# కరాటే పోటీల్లో "గోల్డ్" ,"సిల్వర్" మెడల్స్ సాధించిన గిరిజన విద్యార్థి

- అభినందించిన హెచ్ఎం ఎస్. సంధ్య తోటి ఉపాధ్యాయులు






**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 6:**మండలంలో పి.మాకవరం గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన కొర్ర గాయత్రి కరాటే పోటీల్లో గోల్డ్ , సిల్వర్ మెడల్స్ సాధించడం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం ఎస్ సంధ్య, పేర్కొన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరాటే పోటీల్లో గెలుపొందిన 5వ తరగతి విద్యార్థి కొర్ర గాయత్రి కి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సంధ్య మాట్లాడుతూ... కొయ్యూరు మండలం గరిమండ గ్రామానికి చెందిన కొర్ర గాయత్రి ఇటీవల విశాఖపట్నం యారాడ బీచ్ లో జరిగిన కరాటి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కాటా ఈవెంట్ (ఏ )లో గోల్డ్ మెడల్, కాటఈవెంట్ కమిటీ( బీ)లో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అతి చిన్న వయసులోనే కరాటి పోటీల్లో గోల్డ్ మేడల్ సిల్వర్ మెడల్ సాధించి. గిరిజన ప్రాంతానికి కొయ్యూరు మండలానికి ముఖ్యంగా ఈ మాకవరం బాలికల ఆశ్రమ పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిఈటి పద్మ, హిందీ ఉపాధ్యాయురాలు పి శ్రీదేవి, లక్ష్మీదేవి, సుజాత, శ్యామల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది గాయత్రిని అభినందనలతో ముంచెత్తారు

# బాబు ఐడియా: కొన్ని మైనస్‌లకు 'ఇది' ప్లస్!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏ రాష్ట్రంలో అయినా.. ఏ ప్రభుత్వంలో అయినా.. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా.. ఇవి అందిన వారు హ్యాపీనే. కానీ.. అందరికీ అందాలని లేదుకదా?. కారణాలు ఏవైనా.. కొందరు మాత్రం నిరుత్సాహంతో నే ఉంటారు. ముఖ్యంగా మహిళల విషయంలో అయితే.. ఈ తరహా నిరుత్సాహం మరింత కామన్. కానీ.. అర్హతలు, ప్రామాణికాలను దృష్టిలో పెట్టుకుంటే.. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అందరికీ చేరువ కావడం కష్టసాధ్యం.

ఇలానే.. ఏపీలోనూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందిస్తున్న 'సూపర్ 6' సహా.. ఇతర పథకాల వ్యవహారంలో 35 శాతం మంది ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ప్రభుత్వానికి స్పష్టత వచ్చింది. ఒకవైపు సామాజిక భద్రతా పింఛన్లను పెంచి ఇస్తున్నా.. మరోవైపు.. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15 వేల చొప్పున ఇచ్చినా.. రైతు భరోసా ఇచ్చినా.. ఈ నిరాస.. అసంతృప్తి మాత్రం కొనసాగుతోంది. ఈ విషయంపై సీఎం చంద్రబాబు నివేదికలు తెప్పించుకున్నారు.

ఈ క్రమంలోనే 35 శాతం మంది తీవ్ర స్తాయిలో, 21 శాతం మంది.. మధ్య స్థాయిలో అసంతృప్తితో ఉన్నార ని గుర్తించారు. మరీ ముఖ్యంగా మహిళల్లో ఈ అసంతృప్తి పాళ్లు ఎక్కువగానే ఉన్నాయన్నది ప్రభుత్వానికి అందిన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ఇక, 42 శాతం మంది మాత్రమే సంక్షేమ పథకాల కారణంగా సంతృప్తితో ఉన్నారన్నది ప్రభుత్వానికి చేరిన సమాచారం. మరో 2 శాతం మంది తటస్థంగా ఉన్నారు. దీంతో ఇప్పుడు అన్ని బారికేడ్లు తొలగించి.. అందరినీ సంతృప్తి పరచాలన్నది సీఎం చంద్రబాబు వ్యూహం.

ఈ క్రమంలోనే నిన్న మొన్నటి వరకు కూడా ఏడాదికి రూ.350 కోట్ల మేరకు ఖర్చవుతుందన్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంపై తటపటాయించిన సీఎం.. ఇప్పుడు సుమారు 2000 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని తేలినా... పచ్చజెండా ఊపేశారు. నిన్నటి వరకు .. కేవలం జిల్లాలకు మాత్రమే పరిమితమని.. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే లిమిట్ అని చెప్పిన ఈ పథకాన్ని ఇప్పుడు.. డీలక్స్, లగ్జరీ వరకు పొడిగించారు.రాష్ట్ర వ్యాప్తంగా అందరు మహిళలకు దీనిని అందుబాటులోకి తెస్తున్నారు. అంటే.. ఇక, పేద, మధ్యతరగతి, ఉన్నత స్థాయి అనే తేడా లేకుండా.. అన్ని వర్గాల మహిళలను మెప్పించవచ్చన్నది బాబు ఐడియా. సో.. ఈ క్రమంలోనే 2000 కోట్లయినా ఫర్వాలేదని పచ్చజెండా ఊపేశారు. అంటే.. కొన్ని మైనస్‌లను చెరిపేసేందుకు ఒక్క ప్లస్‌ను ఎంచుకున్నారన్న మాట.

# బంగారం ధరలలో భారీ మార్పులు.. కొనాలా? అమ్మాలా? ఏది సరైన సమయం?

**హైదరాబాద్ పెన్ పవర్:** మగువలకు అత్యంత ప్రీతికరమైన వాటిలో బంగారం ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకుంది. సందర్భం ఏదైనా సరే తప్పకుండా బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాల్సిందే. ఇక మరికొంతమందికి ఈ బంగారం పెట్టుబడి వనరుగా మారింది. మార్కెట్ ను దృష్టిలో పెట్టుకొని చాలామంది ఈ బంగారంపై పెట్టుబడులు పెడుతూ లాభాన్ని కూడా అర్జిస్తున్నారు. అయితే ఇప్పుడు రూపాయి విలువ పడిపోవడంతో బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పైగా మన భారతదేశంలో పెళ్లిళ్లు, పండుగలు వచ్చాయి అంటే చాలు బంగారు ఆభరణాలు కొనుగోలు చేయడానికి ప్రతి ఒక్కరు ఆసక్తి చూపిస్తారు.ఇదిలా ఉండగా.. గతంతో పోల్చుకుంటే.. ప్రస్తుతం బంగారం ధరలు భారీగా పెరిగిపోయాయి. ఇలాంటి సమయంలో బంగారాన్ని కొనుగోలు చేయాలా ? లేక అమ్ముకోవాలా? అనే సందిగ్ధంలో పడ్డారు ప్రజలు. మరి బంగారాన్ని కొనుగోలు చేయడానికైనా లేదా అమ్మడానికైనా ఏది సరైన సమయం అనే విషయం ఇప్పుడు చూద్దాం. గత రెండు మూడు సంవత్సరాలతో పోల్చుకుంటే ప్రస్తుతం బంగారం ధరలు గరిష్ట స్థాయిలో ఉన్నాయి. అయితే ఇది ఇంకా పెరగవచ్చు అనడానికి పలు కారణాలు కూడా ఉన్నాయి అని చెప్పాలి. ముఖ్యంగా అంతర్జాతీయ పరిస్థితులు.. అటు అమెరికా, చైనా, రష్యా వంటి దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అమెరికా డాలర్ బలహీనమవడంతో గోల్డ్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పైగా క్రూడ్ ఆయిల్ ధరలు కూడా పెరుగుతున్నాయి. అంతేకాదు ఇండియా తో సహా కేంద్ర బ్యాంకులన్నీ కూడా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలు పెంచుకుంటున్నాయని చెప్పవచ్చు. ఇటు మన భారత దేశ పరిస్థితి విషయానికి వస్తే.. ఇక్కడ పెళ్లిళ్లు, పండుగలు సీజన్లో బంగారానికి డిమాండ్ భారీగా ఉంటుంది. రూపాయి బలహీనత కూడా బంగారం ధర పెరుగుదలకు కారణం అవుతోంది అని చెప్పవచ్చు. ఇక వచ్చే పది సంవత్సరాలలో బంగారం ధరలు ఎలా ఉండొచ్చు అనే విషయానికంటే ముందే.. గత పది సంవత్సరాల క్రితం అంటే 2013 నుండి



2015 మధ్యకాలంలో.. 10 గ్రాముల బంగారం ధర సుమారుగా రూ.27,000 నుండీ రూ.31,000 వరకూ ఉండేది. కానీ కాలక్రమేనా పరిస్థితుల్లో మార్పులు రావడం వల్ల 2023 చివరి నాటికి అదే 10 గ్రాముల బంగారం విలువ రూ.61,000 నుండీ రూ.63,000 వరకు చేరింది.. అంటే సగటున 8 – 9%శాతం వార్షిక రాబడి పెరిగింది అని చెప్పవచ్చు. కానీ ఈ పెరుగుదల సామాన్యుడికి భారంగా మారిందని చెప్పాలి. ఇక మరో 10 ఏళ్ల ముందుకు వెళ్తే అంటే.. 2035 నాటికి అదే 10 గ్రాముల బంగారం ధర రూ. 1.25 లక్షల వరకు వెళ్లే అవకాశం ఉందని బంగారం మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరి ఇలాంటి సమయంలో బంగారం కొనుగోలు చేయాలా లేక అమ్మాలా అనే కన్ఫ్యూజన్లో పడ్డారు ప్రజలు. ఇలాంటి వారికి మార్కెట్ నిపుణులు చెప్పేది ఏమిటంటే బంగారాన్ని సేవింగ్స్ విధానంలో భద్రపరచుకుంటే సురక్షితంగా భవిష్యత్తు తరాలకు ఉపయోగించుకోవచ్చు అని చెబుతున్నారు. ముఖ్యంగా మీరు డబ్బును రియల్ ఎస్టేట్ లో, మ్యూచువల్ ఫండ్స్ లో, స్టాక్స్ లో పెట్టి రిస్క్ లో పడటం కంటే ఇలా గోల్డ్ రూపంలో సేవింగ్స్ చేసుకోవడం ఉత్తమమని చెబుతున్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బాండ్లు, వార్షిక ఆదాయం, ధరలు పెరిగితే మరింత లాభం కూడా.. డిజిటల్ గోల్డ్ తో భద్రతతో పాటు ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చు. ముఖ్యంగా పెళ్లిళ్లు, ఎవరికైనా గిఫ్ట్ ఇవ్వడం కోసం మాత్రమే బంగారాన్ని కొనుగోలు చేయాలి అని.. మిగతా సందర్భాలలో గోల్డ్ పై పెట్టుబడులు పెట్టడం వల్ల భవిష్యత్తులో మంచి ఆదాయం ఉంటుంది అని కూడా చెబుతున్నారు. మరి ముందస్తు ప్రణాళికలను దృష్టిలో పెట్టుకొని బంగారం పెట్టుబడుల వైపు అడుగులు వేస్తే లాభపడవచ్చు అని కూడా నిపుణులు చెబుతున్నారు.

# సంధ్య థియేటర్ ఘటన : మానవ హక్కుల కమిషన్ సీరియస్ యాక్షన్




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో "పుష్ప–2" సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ దుర్ఘటనలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోవడంపై తీవ్రంగా స్పందించిన కమిషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

**పోలీసుల నివేదికపై ఎన్హెచ్‌ఆర్‌సీ అసంతృప్తి**

ఈ ఘటనపై పోలీసులు సమర్పించిన ప్రాథమిక నివేదికపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రీమియర్ షోకు పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి లేదని నివేదికలో పేర్కొనడాన్ని కమిషన్ గమనించింది. అనుమతి లేకుండా షో ఎలా నిర్వహించారనే దానిపై అలాగే నటుడు అల్లు అర్జున్ రాకతో పెద్ద సంఖ్యలో అభిమానులు ఎందుకు తరలివచ్చారో స్పష్టమైన వివరణ ఇవ్వాలని ప్రశ్నించింది.

**ప్రభుత్వానికి ఎన్ హెచ్‌ఆర్‌సీ సూటి ప్రశ్నలు**

ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన యువతి కుటుంబానికి కనీసం రూ. 5 లక్షల పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఎందుకు ఇవ్వకూడదు? అని ప్రశ్నించింది. ఘటనకు సంబంధించి పూర్తిస్థాయి విచారణ జరిపి, ఆరు వారాల్లోగా మరో నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు సీఎస్‌కు కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.

**హైదరాబాద్ సీపీకి సూచనలు**

సంధ్య థియేటర్‌లో రద్దీని ముందుగానే అంచనా వేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపారని ఎన్‌హెచ్‌ఆర్‌సీ అభిప్రాయపడింది. అందుకే, ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరపాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ (సీపీ)కు సూచించింది. ఈ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీసుకున్న ఈ చర్యలు తెలంగాణలో ప్రభుత్వ వ్యవస్థల పర్యవేక్షణపై మానవ హక్కుల కమిషన్ ఎంత సీరియస్‌గా ఉందో స్పష్టం చేస్తున్నాయి. బాధిత కుటుంబానికి న్యాయం జరగడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం.

# "కరుణానిధి తర్వాత.. సీఎం రేవంతే": ఊహించని ప్రశంస!



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఊహించని నాయకురాలి నుంచి ప్రశంసలు దక్కాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే లక్ష్యంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు చేసి.. రాష్ట్రపతికి పం పించిన విషయం తెలిసిందే. అయితే.. రాష్ట్రపతి దీనికి ఆమోద ముద్ర వేయలేదు. దీంతో కేంద్రంలోని మోడీ సర్కారు వైఖరిని ఎండగడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు.. జంతర్ మంతర్ వద్ద ధర్నాకు దిగారు. ఈ ధర్నాకు.. ఇండి కూటమిలో మిత్రపక్షాలుగా పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఇండియా కూటమి నాయకులు కూడా ఈ ధర్నాలో పార్టిసిపేట్ చేశారు. తమిళనాడు అధికార పార్టీ డీఎంకే ఎంపీ.. కనిమొళి సహా.. మహారాష్ట్రకు చెం దిన ఎన్సీపీ పార్లమెంటు సభ్యురాలు సుప్రియా సూలే.. తదితరులు.. సీఎం రేవంత్ చెంతనే కూర్చుని కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని నిరసించారు. బీసీలకు మేలు చేయాలన్న తలంపుతోనే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ తీసుకువచ్చిందని.. దీనికి కూడా కేంద్రం అడ్డు పడుతోందని నాయకు లు విమర్శించారు. ఇది సరికాదన్నారు. ఈ సందర్భంగా సుప్రియా సూలే మాట్లాడుతూ.. రేవంత్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. రేవంత్ రెడ్డి పదవు ల కోసం కాకుండా పార్టీ కోసం పనిచేశారని వ్యాఖ్యానించారు. %--%ఒక కార్యకర్త.. ఏమీ లేని స్థాయి నుంచి ము ఖ్యమంత్రి పీఠం వరకు ఎదిగారు. ఇది అసాధారణం%--% అని రేవంత్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. సమా జంలోని పేదలు, బడుగు బలహీన వర్గాల తరఫున రేవంత్ రెడ్డి పోరాడారని తెలిపారు. ఇప్పుడు కూడా అదేస్ఫూర్తితో పేదలకు, బడుగులకు మేలు చేస్తున్నారని సుప్రియా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డిని ఆమె.. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిని మించిపోతారని.. వ్యాఖ్యానించారు. గతంలో కరుణానిధి తమిళనాడులోని వెనుక బడిన వర్గాలకు 69 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రయత్నించారని.. దీనిని షెడ్యూల్ 9లో కూడా చేర్చారని అన్నారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో 42 శాతం బీసీలకు మేలు చేయాలన్న లక్ష్యంతో రేవంత్ ముందుకు సాగుతున్నాని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డి పేరు కూడా చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ ఊహించని ప్రశంసలకు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

# ట్రంప్ మిడ్‌నైట్ 2PM బాంబ్: భారత్‌పైనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన ప్రకటనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆయన ప్రకటించిన మీడియా సమావేశం తాలూకు సమయం, పరిస్థితులు గమనిస్తే అంతర్జాతీయ రాజకీయాల్లో ఏదో కీలక పరిణామం చోటు చేసుకోబోతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ట్రంప్ ప్రకటనపై ఉత్కంఠ**

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4:30 గంటలకు (భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి 2:00 గంటలకు) ట్రంప్ ఓవల్ ఆఫీసులో మీడియా సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా వైట్‌హౌస్ ధృవీకరించడంతో ఆయన ఏం చెప్పబోతున్నారు అన్న ఉత్కంఠ అంతర్జాతీయంగా నెలకొంది.

**భారత్‌పై సుంకాల ప్రకటనేనా?**

ఇటీవలి రోజుల్లో భారత్‌పై ట్రంప్ విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. "భారత్ మంచి వ్యాపార భాగస్వామి కాదు" అంటూ ఆయన ఆరోపించగా, రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేస్తున్నదాన్ని టార్గెట్ చేశారు. మాస్కోకు ఈ కొనుగోళ్లు నేరుగా "యుద్ధ ఇంజిన్‌కి ఇంధనం" అందిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో భారత్‌పై ఇప్పటికే 25% టారిఫ్‌లు విధించిన ట్రంప్, కొత్తగా మరిన్ని సుంకాలు విధించే అవకాశం ఉందన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ మీడియా సమావేశంలో అదే ప్రస్తావన ఉండవచ్చన్న అనుమానాలు వెల్లివిరుస్తున్నాయి.

**రష్యాపై ఆంక్షల వైపు?**

ఇక అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కోఫ్ ప్రస్తుతం మాస్కోలో పర్యటిస్తున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరగబోయే భేటీ అనంతరం కీలక ప్రకటనలున్నాయన్న సంకేతాలు ట్రంప్ ఇప్పటికే ఇచ్చారు. రష్యా కాల్పుల విరమణకు అంగీకరించకపోతే ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఇతర రంగాల్లోనూ కీలక మార్పులు?**

ఇక ట్రంప్ విమర్శల జాడలో అమెరికా బ్యాంకులు, ఫెడరల్ రిజర్వ్ వ్యవస్థ కూడా ఉన్నాయి. బ్యాంకులు రాజకీయ వివక్ష చూపుతున్నాయని ఆయన ఆరోపించగా, ఫెడ్ ఛైర్మన్ పదవి కోసం నలుగురు నామినీలు పోటీ పడుతున్నారని వెల్లడించారు. అదికూడా ఆయన రేపు ప్రకటించే అంశాల్లో ఒకటై ఉండే అవకాశముంది. అంతేకాదు సెమీకండక్టర్లు, ఫార్మా రంగాలపై త్వరలోనే కీలక నిర్ణయాలు తీసుకుంటానని గతంలో ట్రంప్ చెప్పిన మాటలు కూడా ఈ సందర్భంగా గుర్తుకు వస్తున్నాయి. ట్రంప్ ఈ మిడ్‌నైట్ బాంబ్ ప్రకటనతో ప్రపంచ రాజకీయాలు, గ్లోబల్ మార్కెట్లు ప్రభావితమయ్యే అవకాశాలు ఉన్నాయన్నది స్పష్టంగా కనిపిస్తోంది. ఇది భారత్‌పైనా సుంకాల బాంబా? లేక రష్యాపై ఆంక్షల ప్రబల సంకేతమా? అన్నది అర్ధరాత్రి రెండు గంటలకు తేలనుంది.

# కాళేశ్వరం కుస్తీ.... ఎవరికి లాభం?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం.. ఎవరికి మేలు చేస్తుంది? ఎవరికి మైనస్ అవుతుంది?. ఇదీ.. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న చర్చ. అవినీతిని ఎవరూ సహించరు. పైగా నిజంగానే ప్రజాధనం వృథా అయితే.. ఎవరు మాత్రం చర్యలు తీసుకోకుండా ఉండమని చెబుతారు? సో.. ఈ కోణంలో ఆలోచన చేస్తే.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న ప్రకారం..చర్యలు తీసుకోవాల్సిందే. కానీ, ఇక్కడే తటపటాయింపు చోటు చేసుకుంది. ఏ కార్యక్రమం చేపట్టినా.. కొంత నిధులు వృథా అవుతాయి. వాటికి కారణాలు కూడా ఉంటాయి. అంతే తప్పు.. ప్రధాన ప్రాజెక్టే అవినీతి అంటే.. మాత్రం ప్రభుత్వానికి ఇబ్బంది. వాస్తవానికి ఇదే ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు కలిసి వస్తున్న అంశం. తమను ఉద్దేశ పూర్వకంగానే వేధిస్తున్నారని.. కేసీఆర్‌పై కక్షసాధింపు కోసమే ఇలా చేస్తున్నారన్న వాదన బలంగా ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నా రు. నిజానికి తెలంగాణ సాధన తర్వాత.. కట్టిన అతిపెద్ద ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం. దీని నుంచి 2 లక్షల ఎకరాలకు పైగానే సాగు భూమికి నీరు అందుతుంది. అలానే 132 గ్రామాలకు తాగునీరు కూడా అందుతుంది. దీనిని ఎవరూ వ్యతిరేకించడం లేదు. ప్రభుత్వం కూడా.. దీనిపై ఆచితూచి వ్యవహరిస్తోంది. అసలు ప్రాజెక్టే తప్పని ప్రభుత్వం కూడా చెప్పడం లేదు. కానీ, అవినీతి జరిగిందని అంటున్నారు. ఈ అవినీతిని నిరూపించి.. కేసీఆర్ పై చర్యలు తీసుకునే విషయంలో అధికార పార్టీలోనే విబేదాలు పొడచూపుతుండడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. కాటగారికల్‌గా.. కేసీఆర్ తప్పులు ఎత్తి చూపించినా.. ఆయనపై చర్యలు తీసుకునే విషయంలో కేసీఆర్ ఉన్న ఇమేజ్.. ప్రజల్లో నెలకొన్న సెంటిమెంటు వంటివి అడ్డువస్తున్నాయన్నది కీలక నాయకులు చెబుతున్న మాట.

ఒకవేళ.. ప్రభుత్వమే.. కనుక కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ రిపోర్టును అడ్డు పెట్టుకుని కేసీఆర్‌ను అరెస్టు చేయదలిస్తే... దీనిని ఆయన మాత్రం ఎందుకు తేలికగా తీసుకుంటారు?. సీరియస్‌గానే వ్యవహరిస్తారు. ఈ క్రమంలోనే బిగ్ ప్లాన్ దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు. ప్రజల మధ్య ఉండేందుకు ఆయన ప్రణాళికలు చేస్తున్నారు. తద్వారా తన అరెస్టే అనివార్యమైతే.. అది ఇంట్లో కాదు.. ప్రజల మధ్యే జరగాలన్నది ఆయన వ్యూహం. తద్వారా.. తెలంగాణ సాధకుడినే అరెస్టు చేశారన్న సెంటిమెంటును ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. సో.. ఈ నేపథ్యంలో కాళేశ్వరం కుస్తీ వ్యవహారం.. కాంగ్రెస్ కంటే కూడా.. బీఆర్ఎస్‌కు లాభించేలా చేసుకునే ప్రతిపాదన అయితే.. తెరమీదికి వస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కూల్చుతామన్న 'ఫాంహౌజ్' నుంచే బీఆర్ఎస్ ను చీల్చుతున్న బీజేపీ



**హైదరాబాద్ పెన్ పవర్:** మానసిక ప్రశాంతత, రాజకీయ రణగొణ ధ్వనులకు దూరంగా అధినేత కేసీఆర్ అత్యధిక సమయం గడిపే ఫాంహౌజ్ కారణంగా బీఆర్ఎస్ ను ప్రత్యర్థి పార్టీలు తరచూ విమర్శిస్తుంటాయి. ఫాంహౌజ్ పార్టీ అని కూడా ఎద్దేవా చేస్తుంటాయి. సరిగ్గా మూడేళ్ల కిందట మరో ఫాంహౌజ్ తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపింది. అదే హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ ఫాంహౌజ్. బీఆర్ఎస్ కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలకు రూ.వందకోట్లు, కాంట్రాక్టులు ఎరవేసి వారిని బీజేపీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపించింది. దీనిపై అధినేత కేసీఆర్ కు ముందే ఉప్పందడంతో మొయినాబాద్ ఫాంహౌస్ కుట్రను భగ్నం చేశామని చెప్పుకొచ్చింది. ఇది జరిగింది 2022 నవంబరులో వచ్చిన మునుగోడు ఉప ఎన్నికకు ముందు.

**ఆ ఎమ్మెల్యేలను వెంటేసుకుని..**

ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారాన్ని బీఆర్ఎస్ మునుగోడు ఉప ఎన్నికల్లో బలంగా ఉపయోగించుకుంది. బీజేపీ వల విసిరిన ఎమ్మెల్యేలు (గువ్వల బాలరాజు-అచ్చంపేట, పైలట్ రోహిత్ రెడ్డి-తాండూరు, బీరం హర్షవర్ధన్ రెడ్డి-కొల్లాపూర్, రేగా కాంతారావు-పినపాక) ను కేసీఆర్ తన వెంట ప్రచారంలో తిప్పారు. మీడియా సమావేశంలోనూ వారిని చూపించారు. రూ.వంద కోట్లకూ తలగ్గొని తమ ఎమ్మెల్యేలు అంటూ గొప్పగా చెప్పారు. ఇదంతా ఫలించి మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పది వేల ఓట్లతో గెలుపొందింది.

**నాడు బీజేపీకి దెబ్బ**

మునుగోడు ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ కు రాజీనామా చేసి 2022లో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు. బలమైన నాయకుడు అయిన ఆయనను ఓడించడం కష్టమే అనే అభిప్రాయం ఏర్పడింది. మునుగోడులో బీజేపీ జెండా ఎగరడం ఖాయం అని అందరూ భావించారు. కానీ, చివర్లో ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ ప్రయత్నం చేసిందంటూ కేసీఆర్ బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీసి విజయం సొంతం చేసుకున్నారు.

**ఇప్పుడు అక్కడి నుంచే మొదలు..**

తెలంగాణలో అధికారం అనే కలను సాకారం చేసుకునే దిశలో... మునుగోడు ఉప ఎన్నికలో గెలుపు అత్యంత అవసరం అని బీజేపీ భావించింది. కానీ, ఆ ఓటమితో అంతా మారిపోయింది. సరిగ్గా ఏడాది తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వెనుకబడిపోయింది. మునుగోడులో ఓటమి, అసెంబ్లీ ఎన్నికల్లో వెనుకబాటుకు పరోక్ష కారణం.. మొయినాబాద్ ఫాంహౌజ్ అంశమేనని కమలనాథుల భావన. అందుకనే అక్కడినుంచే నరుక్కొచ్చే పని చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును ఆపరేషన్ ఆకర్ష్ లో తమవైపు తిప్పుకొంది. మొయినాబాద్ ఫాంహౌజ్ ఘటనలో ఉన్న మరో ఎమ్మెల్యే కూడా తర్వలో బీజేపీలో చేరతారని చెబుతున్నారు. అంటే.. ఎక్కడైతే పోగొట్టుకున్నామో అక్కడే మళ్లీ వెదుక్కోవడం అన్నమాట. నాడు కేసీఆర్ ఈ అంశాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లి.. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని పడగొడతామని ప్రకటనలు చేశారు.

**నాడు నేడు బీఎల్ సంతోష్...**

బీఎల్ సంతోష్.. కర్ణాటకకు చెందిన బీజేపీ అగ్రనేత. జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత). బీజేపీలో మోస్ట్ పవర్ ఫుల్. అలాంటి బీఎల్ సంతోష్‌ను ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఆర్ఎస్ ప్రధాన పాత్రధారిగా పేర్కొంది. ఆయన అరెస్టుకు సైతం ప్రయత్నాలు సాగించింది. ఇప్పుడు అదే బీఎల్ సంతోష్.. నాటి మొయినాబాద్ ఫాంహౌజ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. గువ్వలతో పాటు మరో మాజీ ఎమ్మెల్యే ఆయనను కలుసుకోవడమే దీనికి నిదర్శనం.

# అమరావతికి రాజముద్ర.... శుభవార్త అపుడేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** అమరావతి రాజధాని. ఇది అందరికీ తెలుసు. ఏపీ వారికి ఇంకా బాగా తెలుసు. ఎందుకంటే రోజూ అదే విషయం మీద అంతా మాట్లాడుకుంటారు కాబట్టి. అయితే అమరావతిని రాజధాని అని అనుకుంటే సరిపోదు కదా. దానికి చట్టబద్ధత అవసరం కదా అన్న చర్చ అయితే ఉంది. అమరావతిని రాజధానిగా చేసుకుంటూ ఇప్పటికి పదకొండేళ్ల క్రితం అక్కడ శంకుస్థాపనలు చేశారు. అక్టోబర్ 22న జరిగిన ఆ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరై శ్రీకారం చుట్టారు. ఇక మరోసారి తాజాగా అమరావతి పునర్ నిర్మాణ పనులకు కూడా నరేంద్ర మోడీ వచ్చారు. అయితే ఈ పదకొండేళ్ళ మధ్యలో అమరావతి రాజధానికి చట్టబద్ధత అయితే రాలేదు. ఎందుకు రాలేదు అంటే...

**గెజిట్ నోటిఫికేషన్ లో :**

ఒక రాష్ట్రానికి ఫలానా నగరం లేదా ప్రాంతం అతి ముఖ్య పట్టణం అని కేంద్రం గుర్తించాలి. ఆ ముఖ్యపట్టణం రాజధానిగా అవుతుంది. పాలనాపరంగా అక్కడ నుంచే అంతా జరుగుతుంది. అలా దేశంలో ప్రతీ రాష్ట్రానికీ రాజధానిని కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా గుర్తించింది. కానీ ఏపీలో అమరావతికి మాత్రం ఆ గుర్తింపు అయితే ఇప్పటిదాకా లేదు. దశాబ్దం పైగా జరిగిపోతున్నా అమరావతి ఒక రాజధానిగా అధికారిక గుర్తింపుని పొందలేకపోయింది.

**డబుల్ ఇంజన్ సర్కార్ అయినా :**

కేంద్రంలో ఎన్డీయే ఉంది. రాష్ట్రంలో కూడా ఎన్డీయే ప్రభుత్వం ఉంది. ఇలా రెండు ప్రభుత్వాలూ ఒక్కటే ట్యూన్ తో సాగుతున్నాయి. అక్కడ టీడీపీ మంత్రులు ఉంటే ఇక్కడ ప్రభుత్వంలో బీజేపీ మంత్రి ఉన్నారు. అయినా ఏపీకి రాజధాని హోదా అన్నది అధికారికంగా దఖలు పడలేదు. ఇలా ఎందుకు జరుగుతోంది అన్నదే చర్చగా ఉంది. ఈ రోజున చూస్తే కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఏపీలోని టీడీపీ ఎంపీలే ఆక్సిజన్ గా ఉన్నారు. మరి అమరావతి ఏపీకి రాజధాని అన్న గెజిట్ నోటిఫికేషన్ రావడానికి ఎక్కడ ఏ స్థాయిలో ఆలస్యం అవుతోంది అన్నదే చర్చగా ఉంది.

**మూడు ముక్కలాట అందువల్లనే :**

ఏపీకి అధికారిక ముద్రతో రాజధాని అన్నది లేకపోవడం వల్లనే వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడు ముక్కలాట సాగింది అని అంతా అంటున్నారు. ప్రత్యేకించి రాజధాని అంటే ఫలానాది అని చెప్పుకునే వీలు లేకుండా పోయింది అని అంటున్నారు. ఇపుడు చూస్తే అమరావతి రాజధాని అన్నది ఏపీలోని అయిదు కోట్ల మంది ప్రజానీకం ముక్తకంఠంతో ఆమోదిస్తున్నారు. 94 శాతం స్ట్రైక్ రేట్ తో కూటమికి సీట్లను ఓట్లను జనాలు కట్టబెట్టారు. ఏపీకి రాజధాని ఒక సెంటిమెంట్ గా మారింది. ఇక అమరావతి రాజధాని నిర్మాణానికి కూటమి ప్రభుత్వం గత ఏడాదిగా చురుకుగా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో రాజ ముద్ర మీద ఇంకా ప్రకటన రాకపోవడం మీదనే అంతా ఆలోచిస్తున్నారు.

**రైతుల మదిలో మాట :**

తాజాగా అమరావతి రైతులను కలసి మాట్లాడినపుడు కూడా వారు అమరావతికి రాజధానిగా అధికార ముద్ర ఉండాలని కోరారు. గెజిట్ నోటిఫికేషన్ తొందరగా రావాలని వారు బలంగా కోరుకుంటున్నారు. రెండవ విడత భూసేకరణకు తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని అమరావతిని ఏపీకి శాశ్వత రాజధానిగా అధికారికంగా గుర్తించాలని అంటున్నారు. ఇది ఎంత తొందరగా ప్రక్రియ సాగితే అంత మంచిది అని కూడా చెబుతున్నారు.

**బీజేపీ నుంచి భరోసా :**

ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ గా నియమితులైన పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన గుంటూరు పర్యటన నేపథ్యంలో అమరావతి రైతులు కలిశారు. వారు తన మనసులో మాటను ఆయనకు చెప్పారు. ఈ క్రమంలో పీవీఎన్ మాధవ్ వారికి హామీ ఇచ్చారు. అమరావతికి రాజముద్ర దక్కేలా చూస్తామని అన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అమరావతికి అధికార ముద్ర పడేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. మొత్తం మీద తొందరలోనే అమరావతికి రాజముద్ర పడుతుందని అంతా ఆశిస్తున్నారు. అది కనుక జరిగితే అమరావతి ఏపీకి శాశ్వత రాజధానిగా పక్కా అధికార ముద్రతో ఉంటుంది అని అంటున్నారు.

# గేమింగ్ యాప్ ప్రమోషన్ వివాదంపై హీరో విజయ్ దేవరకొండ స్పందన



**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ ఇటీవల బెట్టింగ్ యాప్ ప్రమోషన్ ఆరోపణలపై తన మీద వచ్చిన విమర్శలకు గట్టిగా స్పందించారు. %ూ%23 అనే గేమింగ్ యాప్‌కు మాత్రమే తాను ప్రచారం చేశానని, అది పూర్తిగా చట్టబద్ధమైన యాప్ అని ఆయన స్పష్టం చేశారు. గేమింగ్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లు ఒకటే కాదని, రెండూ వేర్వేరు అని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.

**ఈడీ విచారణకు పూర్తి సహకారం**

ఇటీవల ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) విచారణకు హాజరైన సందర్భంగా ఆయన తన బ్యాంక్ లావాదేవీలు, తీసుకున్న మొత్తం, కాంట్రాక్టు వివరాలు వంటి అన్ని పత్రాలను సమర్పించారు. "నేను ఎప్పుడూ చట్టానికి లోబడి ఉండే సంస్థలకే ప్రమోషన్ చేశాను. తెలంగాణలో %ూ%23 యాప్ అందుబాటులో కూడా లేదు. నేను తీసుకున్న డబ్బులు కాంట్రాక్టు ఆధారంగానే తీసుకున్నాను. ఈ వివరాలన్నీ ఈడీకి ఇచ్చాను" అని విజయ్ వివరించారు.

**మీడియాపై ఆగ్రహం**

కొన్ని మీడియా ఛానెళ్లు తనను బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విజయ్ దేవరకొండ ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ప్రమోట్ చేసింది గేమింగ్ యాప్ మాత్రమే.

దాన్ని బెట్టింగ్ యాప్‌గా చూపించడం అన్యాయం. ఆ మీడియా సంస్థలు వెంటనే తమ వార్తలను తొలగించాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

ఈ వివాదంపై విజయ్ దేవరకొండ మాట్లాడుతూ తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తిని అని, తనపై వస్తున్న తప్పుడు ప్రచారాలు ఆపాలని కోరారు. నిజాలు ప్రజల ముందుకు రావాలని, న్యాయబద్ధంగా, పారదర్శకంగా పనిచేసేవారు ఎల్లప్పుడూ నిలబడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# వీసా ఆలస్యం.. విద్యార్థులకు ఆశగా మారిన అమెరికా చదువు!




**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా చాలామంది విద్యార్థులు అమెరికాలో చదవాలని ఎన్నో కలలు కంటూ ఉంటారు. అందుకు దిశగా అడుగులు వేస్తారు కూడా.. అయితే ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులను చూస్తుంటే.. ఎందుకు అమెరికాలో విద్యను ఎంచుకున్నాము అని విద్యార్థులు కూడా తలలు పట్టుకుంటున్నారు. ఉన్నత విద్య కోసం అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ తీసుకున్న అంతర్జాతీయ విద్యార్థులు.. ఇప్పుడు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా ఏర్పడిన సరికొత్త నిబంధనల వల్ల వారికి వీసాల జారీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమైనా .. తాము తరగతులకు వెళ్లకపోతుండడంతో పలువురు విద్యార్థులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి వీసా అపాయింట్మెంట్ నిలిపివేతను జూన్ మధ్యలోనే తొలగించినా.. నెల రోజులు దాటుతున్నా.. ఈ ప్రక్రియ ఇంకా వేగవంతం కాలేదు. దీంతో వేల మంది విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం ఇటు విద్యార్థులపైనే కాదు అమెరికా విద్యా వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోంది. అక్కడి విశ్వవిద్యాలయాల బడ్జెట్లు, ఉన్నత విద్యా కేంద్రం.. అమెరికా ఇమేజ్ ని కూడా దెబ్బతీస్తోందని చెప్పవచ్చు.

ఇప్పటికే దక్షిణ కాలిఫోర్నియాలోని ఫుర్మాన్ యూనివర్సిటీలో ఈ ఏడాది కేవలం 562 మంది మాత్రమే కొత్త విద్యార్థులు తమ పేరును నమోదు చేసుకున్నారు. గత ఏడాది 613 మంది నమోదు కాగా.. వీసా కారణంగానే ఇప్పుడు విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయిందని చెప్పవచ్చు.అటు అమెరికాలోని హరిజోనా స్టేట్ యూనివర్సిటీలో కూడా దాదాపు 1,000 మంది అంతర్జాతీయ విద్యార్థులకు వీసాలు రాలేదు. ఈ విషయాన్ని ఈ యూనివర్సిటీ ప్రెసిడెంట్ మైఖేల్ క్రో వెల్లడించారు.ముఖ్యంగా భారత్ - చైనా విద్యార్థులకు వీసా మంజూరులో ఏడు రెట్ల వ్యత్యాసం ఉన్నట్లు ఒక టాప్ యూనివర్సిటీ అధికారి కూడా వెల్లడించారు. కేవలం 100 మంది వరకు అంతర్జాతీయ విద్యార్థులు నమోదు చేసుకునే చిన్న కాలేజీలపై కూడా ఇప్పుడు ఈ ప్రభావం భారీగా పడుతోంది.ఇకపోతే వీసా రాక ఇబ్బందులు పడుతూ.. సకాలంలో తరగతులకు హాజరుకాలేని వారికోసం కొన్ని విద్యాసంస్థలు కూడా ప్రత్యామ్నాయాలను వెతుకుతున్నాయి. అటు అరిజోనా యూనివర్సిటీ ఇలా వీసా రాక ఇబ్బంది పడుతున్న విద్యార్థుల కోసం లండన్ లో క్యాంపస్ నిర్వహిస్తోంది. యూఎస్ నార్త్ ఈస్టర్ విశ్వవిద్యాలయం రిమోట్ లర్నింగ్ ఆప్షన్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హార్వర్డ్ కెన్నడీ స్కూల్ కూడా తాత్కాలికంగా తమ విద్యార్థులకు సరైన విద్యను అందించడానికి యూనివర్సిటీ ఆఫ్ టొరంటో లోని ముంక్స్ స్కూల్లో అవకాశం కల్పించేలా పరిశీలనలు చేస్తోంది. ఇలా వీసాల ఆలస్యంతో అంతర్జాతీయ విద్యార్థులు సరైన సమయంలో విద్యను అందుకోవడంలో వెనుకడుగు పడుతోందని చెప్పవచ్చు. అటు విద్యార్థులకు సమయం వృధా.. ఇటు యూనివర్సిటీలపై ఆర్థిక భారం కూడా పెరగనుంది. ఇకపోతే ట్రంప్ కార్యవర్గం చర్యలతో ఉన్నత విద్యకు బలమైన కేంద్రంగా ఉన్న అమెరికా ఇప్పుడు ఆ స్థానం కోల్పోయేలా కనిపిస్తోందని.. వీసా కారణంగా అమెరికా వెళ్లలేని ఎంతోమంది విద్యార్థులు కెనడా, ఆస్ట్రేలియా, యూకే యూనివర్సిటీలో చేరుతున్నట్లు సమాచారం. మొత్తానికైతే అక్కడ నిర్ణయాలు అక్కడ ఆర్థిక వ్యవస్థ పైనే ప్రభావం చూపుతున్నాయని మరి కొంతమంది హెచ్చరిస్తున్నారు . మరి దీనిపై అటు ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో చూడాలి.

# రోహిత్, కోహ్లీలకు బీసీసీఐ బిగ్ షాక్.. 2027 వరల్డ్ కప్‌కు యంగ్ టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్ లో మాత్రమే కొనసాగుతున్నారు. టీ20, టెస్ట్ కెరీర్ కు రిటైర్మెంట్ ప్రకటించిన రోకో జోడీ వన్డే క్రికెట్ లో మాత్రమే కొనసాగడానికి కారణం లేకపోలేదు. సౌతాఫ్రికా వేదికగా 2027లో జరగనున్న వన్డే వరల్డ్ కప్ ఆడాలని రోహిత్, కోహ్లీ నిర్ణయించుకున్నారు. వన్డే వరల్డ్ కప్ ఆడడంపై వీరు అనేక సందర్భాల్లో తమ ఆసక్తిని తెలిపారు. అయితే వీరికి బీసీసీఐ ఊహించని షాక్ ఇవ్వనుంది. 2027 వన్డే వరల్డ్ కప్ కోసం ఇప్పటి నుంచే కుర్రాళ్లను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. వరల్డ్ కప్ కు మరో రెండున్నరేళ్ల సమయం ఉంది. ప్రస్తుతం రోహిత్, కోహ్లీ వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడడంతో వారి ఫామ్ ఆందోళన కలిగిస్తుంది. వీరిద్దరూ ఆ సమయానికి ఫిట్ నెస్ తో పాటు ఫామ్ లో ఉంటారంటే ఖచ్చితంగా చెప్పాలని పరిస్థితి. టెస్ట్ క్రికెట్ లో పేలవ ఫామ్ కారణంగానే ఈ ఇద్దరూ సుదీర్ఘ ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఒక్క ఫార్మాట్ ఆడడంతో వీరి ఫామ్ ప్రస్నార్థకంగా మారింది. బీసీసీఐ కూడా రోహిత్, కోహ్లీ జోడీ ఖచ్చితంగా జట్టులో ఉంటారనే గ్యారంటీ ఇవ్వలేకపోతుంది. ఈ ఇద్దరు దిగ్గజ క్రికెటర్లు లేకపోయినా ఇటీవలే ఇంగ్లాండ్ తో జరిగిన టెస్ట్ సిరీస్ ను టీమిండియా అద్భుతంగా ఆడి 2-2 తో సమం చేసుకుంది. రోహిత్ శర్మను తప్పించి గిల్ కు వన్డే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని బీసీసీఐ భావిస్తోంది. దానికి తగ్గట్టుగా ప్రణాళికలు రచిస్తోంది. ప్రస్తుతం రోహిత్ వయసు 38 కాగా కోహ్లీ వయసు 36. ఈ ఇద్దరూ తిరిగి జట్టులోకి రావడం ఖాయం. ఈ ఏడాది అక్టోబర్‌లో ఆస్ట్రేలియాలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడతారు. ఆ తర్వాత నవంబర్-డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాతో స్వదేశంలో సిరీస్ ఆడతారు. అయితే 2027 వన్డే వరల్డ్ కప్ కు మాత్రం వీరు ఆడడం అనిశ్చితిగానే ఉంది. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో టీమిండియా ఓడిపోయింది. ఈ ఓటమి భారత జట్టుకు బిగ్ హార్ట్ బ్రేక్ అనే చెప్పాలి.

# బుమ్రా గురించి నెగటివ్‌గా మాట్లాడొద్దు.. నెటిజన్స్‌కు సచిన్ రిక్వెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** బుమ్రా భారత టెస్ట్ జట్టులో ఉంటే మన జట్టు గెలవడం కంటే ఎక్కువగా ఓడిపోతుంది. ఇటీవలే ముగిసిన ఇంగ్లాండ్ సిరీస్ లోనే కాదు బుమ్రా కెరీర్ ప్రారంభం నుంచి ఈ బ్యాడ్ సెంటి మెంట్ కొనసాగుతూనే వస్తుంది. 2018లో బుమ్రా అరంగేట్రం చేసినప్పటి నుండి బుమ్రా ఆడని 28 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఇండియా ఐదు మాత్రమే ఓడిపోయింది. 20 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా.. మరో మూడు డ్రాగా ముగిశాయి. దీంతో ఇప్పుడు బుమ్రాపై సరదాగా సోషల్ మీడియాలో ట్రోలింగ్ సాగుతోంది. ఈ సమయంలో క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్.. బుమ్రా గురించి తన ఆలోచనలను షేర్ చేసుకున్నాడు. బుమ్రా గురించి సచిన్ మాట్లాడుతూ.. "జనాలు ఏం మాట్లాడుకుంటున్నారో నాకు తెలుసు. బుమ్రా లేకుండా భారత జట్టు రెండు టెస్టులు గెలిచింది. జనాలు దీన్ని నెగటివ్ కోణంలో చూడకండి. నిజం చెప్పాలంటే ఇది కేవలం యాదృచ్చికం మాత్రమే". అని సచిన్ రెడ్డిట్ వీడియోలో అన్నారు. ఈ సందర్భంగా బుమ్రా ప్రదర్శన గురించి సచిన్ స్పందించాడు. "బుమ్రా చాలా బాగా ఆడాడు. మొదటి టెస్ట్‌లో ఐదు వికెట్లు పడగొట్టాడు. అతను రెండవ మ్యాచ్ ఆడలేదు. కానీ లార్డ్స్‌లో జరిగిన మరోసారి అతను 5 వికెట్లు పడగొట్టాడు. అతను ఆడిన 3 టెస్ట్‌లలో రెండుసార్లు ఐదు వికెట్లు పడగొట్టాడు. చాలా క్వాలిటీ బౌలర్. నేను అతన్ని అగ్రస్థానంలో ఉంచుతాను". అని టెండూల్కర్ చెప్పుకొచ్చాడు.

ఇంగ్లాండ్ తో జరిగిన 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో బుమ్రా ఆడని మ్యాచ్ ల్లో భారత జట్టు టెస్టుల్లో అద్భుత విజయాలను సాధిస్తూ వచ్చింది. తాజాగా ఇంగ్లాండ్ తో ముగిసిన 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను ఇండియా 2-2 తో సిరీస్ సమం చేసింది. ఇండియా గెలిచిన రెండు టెస్టుల్లో బుమ్రా లేకపోవడం విశేషం. బుమ్రా ఆడిన మూడు టెస్టుల్లో రెండు మ్యాచ్ ల్లో ఓడిపోగా.. ఒక మ్యాచ్ డ్రా అయింది. అంతకముందు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా 5 టెస్ట్ మ్యాచ్ లాడితే టీమిండియా కేవలం ఒక మ్యాచ్ లోనే గెలిచింది.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్.. సిరాజ్, ప్రసిద్ కృష్ణలకు కెరీర్ అత్యుత్తమ ర్యాంకులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓవల్ వేదికగా ఇంగ్లాండ్ తో జరిగిన ఐదో టెస్టులో టీమిండియా ఫాస్ట్ బౌలర్లు మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణలు అదరగొట్టిన సంగతి తెలిసిందే. ఐదో టెస్టులో ఇద్దరూ కలిసి 17 వికెట్లు పడగొట్టి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించారు. తొలి ఇన్నింగ్స్ లో సిరాజ్, ప్రసిద్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్ లో సిరాజ్ ఐదు వికెట్లు పడగొట్టగా.. ప్రసిద్ నాలుగు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నాడు. ఈ టెస్ట్ విజయంతో ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను టీమిండియా 2-2 తో సిరీస్ సమం చేసింది. ఈ సిరీస్ తర్వాత సిరాజ్, ప్రసిద్ ర్యాంక్ లు మెరుగయ్యాయి. బుధవారం (ఆగస్ట్ 6) ఐసీసీ టెస్ట్ ర్యాంక్ లను రిలీజ్ చేసింది. సిరాజ్ 674 అత్యుత్తమ రేటింగ్‌లతో ఏకంగా 12 స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో నిలిచాడు. ఈ మ్యాచ్ కు ముందు 27 వ స్థానంలో ఉన్న సిరాజ్ ఒక్కసారిగా టాప్ -15లోకి చేరుకోవడం విశేషం. 386 రేటింగ్ పాయింట్లతో 84 వ స్థానంలో ఉన్న ప్రసిద్ ఏకంగా 25 స్థానాలు ఎగబాకి 59 వ స్థానానికి చేరుకున్నాడు. ఈ సిరీస్ కు ముందు 94 వ స్థానంలో ఉన్న ప్రసిద్ సిరీస్ ముగిశాక టాప్ 60 లోకి రావడం విశేషం. జస్ప్రీత్ బుమ్రా టాప్ ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. రబడా రెండో ర్యాంక్ లో ఉన్నాడు.

**జైస్వాల్ మళ్ళీ టాప్ 5 లోకి జైశ్వాల్:**

బ్యాటింగ్ విషయానికొస్తే, ఓవల్‌లో సెంచరీతో సత్తా చాటిన యశస్వి జైస్వాల్ ఐసీసీ టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో మూడు స్థానాలు ఎగబాకి టాప్-5లో తిరిగి స్థానం సంపాదించాడు. మరోవైపు చివరి టెస్టులో విఫలమైన టీమిండియా కెప్టెన్ శుభమాన్ గిల్ నాలుగు స్థానాలు దిగజారి 13 వ ర్యాంక్ కు పడిపోయాడు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 908 రేటింగ్ పాయింట్స్ తో అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు. ఓవల్ టెస్టుకు ముందు మూడో ర్యాంక్ లో ఉన్న హ్యారీ బ్రూక్ సెంచరీతో ఒక స్థానం ఎగబాకి రెండో ర్యాంక్ కు చేరుకున్నాడు. రిషబ్ పంత్ 8 వ ర్యాంక్ లో కొనసాగుతున్నాడు.

# ఫ్లాపులతో కొట్టుమిట్టాడుతున్న మృణాల్.. బుట్ట సర్దాల్సిందేనా?

హిందీ టీవీ సీరియల్ నటిగా కెరియర్ ఆరంభించి, ఆ తర్వాత నటిగా గుర్తింపు సొంతం చేసుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో హను రాఘవపూడి దర్శకత్వంలో.. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నేరుగా తెలుగులో నటించిన తొలి చిత్రం సీతారామం. ఈ సినిమాలో సీత పాత్రలో చాలా అద్భుతంగా ఒదిగిపోయి నటించింది మృణాల్ ఠాకూర్. తెలుగులో మొదటి సినిమానే అయినా.. ఆ సినిమాలోని పాత్రతో తెలుగువారి హృదయాలను దోచుకుంది. పైగా తెలుగు ఆడియన్స్ ఈమెను ఓన్ చేసుకున్నారు. తర్వాత నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలో కూడా నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమాలో కూడా కథానాయికగా నటించింది కానీ ఈ సినిమా పెద్దగా వర్కౌట్ కాలేదు. ఇక ఈ సినిమా తర్వాత ఈమెకు తెలుగులో అవకాశాలు రాలేదు. పైగా దాదాపు ఐదు సంవత్సరాల సినీ కెరియర్లో రెండు చిత్రాలు తప్ప మరో సినిమా ఈమెకు విజయాన్ని అందించలేదు. అటు కథానాయికగా ఎదిగిన బాలీవుడ్ లో కూడా వరుసగా ఎదురు దెబ్బలు తగులుతూనే వచ్చాయి. 2019లో హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ 30 సినిమాతో మంచి బ్రేక్ అందుకున్న ఈమె.. ఆ తర్వాత ఒక్క సినిమాతో కూడా సక్సెస్ అందుకోలేకపోయింది. సూపర్ 30 తరువాత బాలీవుడ్ లో తూఫాన్, బాట్లా హౌస్, జెర్సీ, సెల్ఫీ, గుమ్రా, ఆంఖ్ మిచోలి, పిప్పా ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ వరుస పరాజయాలే పలకరించాయి. ఇక ఇప్పుడు సన్నాఫ్ సర్దార్ 2లో కూడా నటించింది. అజయ్ దేవగన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు ప్రీ రిలీజ్ బస్ పెద్దగా లేకపోవడం వల్ల ఓపెనింగ్స్ రాలేదు. టికెట్ పై 50% ఆఫర్ పెట్టినా కూడా తొలిరోజు థియేటర్లలో జనం కనిపించకపోవడం, పైగా డివైడ్ టాక్ రావడంతో కలెక్షన్లు కూడా సాధించలేకపోయింది. దాంతో వారంలోపే డిజాస్టర్ మూవీగా తేలిపోయింది ఈ సినిమా. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ అడివి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమాపైనే ఉన్నాయి. సాధారణంగా అడివి శేష్ సినిమాలు అంటే మంచి కంటెంట్ తో వస్తాయని అందరికీ తెలిసిందే. ఇప్పటికే ఆయన నుంచి వచ్చిన గూఢచారి , హిట్ 2 వంటి చిత్రాలు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మొదట ఈ సినిమాలో శృతిహాసన్ కథానాయికగా ఎంపిక అయ్యి.. కొంత భాగం షూటింగ్ కూడా పూర్తి చేశారు. కాకపోతే శృతిహాసన్ వరుస సినిమాల బిజీ షెడ్యూల్స్ కారణంగా ఈ సినిమాకి డేట్ కేటాయించలేకపోయింది. ఫలితంగా సినిమా నుండీ తప్పుకుందని అడివి శేషు ఒక ఇంటర్వ్యూలో తెలియజేశారు. ఇప్పుడు ఆ ఛాన్స్ మృణాల్ ఠాకూర్ కి వచ్చింది. మరి ఈ సినిమాతో నైనా కం బ్యాక్ ఇస్తుందా? ఒకవేళ ఈ సినిమా బెడిసి కొడితే ఇక బుట్ట సర్దాల్సిందేనా ? అనే అనుమానాలు కూడా ఫిలిం ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. మరి ఈ ఒక్క సినిమాపై ఆశలు పెట్టుకున్న మృణాల్ కి ఎలాంటి ఫలితం లభిస్తుందో చూడాలి.





**డియోర్ షూస్ మరియు హౌస్ ఆఫ్ CB డ్రెస్‌లో అదితి బుధతోకి అభిమానులను ఆశ్చర్యపరిచింది**



**షామా దక్షిణ ఫ్రాన్స్‌లో ఆకర్షణీయమైన జీవితాన్ని గడుపుతోంది**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com